ప్రజాశక్తి

శనివారం 4 మార్చి 2023 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

అర్జునుడుకు అంతిమ వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- పాడె మోసిన చంద్రబాబు



అర్జునుడు పాడె మోస్తున్న చంద్రబాబు, అచ్చెన్నాయుడు



అర్జునుడు అంతిమయాత్ర దృశ్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా): టిడిపి సీనియర్ నాయకులు, ఎంఎల్‌సి బచ్చుల అర్జునుడు అంత్యక్రియలు శుక్రవారం మచిలీపట్నంలో జరిగాయి. అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగా జనవరి 28న గుండెపోటుకు గురై విజయవాడ రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచిన ఆయన మతదేహాన్ని మచిలీపట్నంలోని ఆయన స్వగహానికి తరలించారు. శుక్రవారం ఉదయం వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, టిడిపి శ్రేణులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అర్జునుడు పార్థీవ దేహానికి టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రద్ధాంజలి ఘటించారు. అర్జునుడు కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. అనంతరం అర్జునుడు స్వగహం నుండి అంతిమ యాత్ర జరిగింది. మచిలీపట్నం మల్కాపట్నంలోని అర్జునుడు స్వగహం నుండి బందరుకోట వరకు నగర ప్రధాన రహదారుల గుండా సాగిన అర్జునుడు అంతిమయాత్రలో వేలాది మంది అభిమానులు పాల్గొని తమ అభిమాన నాయకుడికి కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రత్యేక వాహనంలో అర్జునుడు స్వగహానికి చేరుకున్న చంద్రబాబు పార్టీ నేతలతో కలిసి అర్జునుడు పార్థీవదేహంపై తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం కొద్దిదూరం అర్జునుడి పాడే మోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. మోసి చితిపేర్చారు. అంతిమ యాత్ర ప్రారంభం నుండి పూర్తయ్యే వరకు చంద్రబాబు, అచ్చెనాయుడుతో పాటు పలువురు టిడిపి నాయకులు ఉన్నారు. బందరుకోటలోని వ్యవసాయ క్షేత్రంలో అర్జునుడు కుటుంబ పెద్దల సమాధుల

(మిగతా 6లో)

విద్యాశాఖలో అక్రమాలు

వివాదంగా జూనియర్ అసిస్టెంట్ల డిప్యూటేషన్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

విద్యాశాఖలో ఉన్నతాధికారులే అక్రమాలకు తెరలేపుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. వసూళ్లకు సహకరించే వారికి తమ కార్యాలయాల్లో డిప్యూటేషన్‌పై నియమించుకుంటున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతోంది. ఈవ్యవహారంలో భారీ మొత్తంలో చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎయిడెడ్, ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు రాష్ట్ర రాజధాని ప్రాంతమైన విజయవాడ పెట్టింది పేరు. ప్రయివేటు పాఠశాలల్లో సౌకర్యాల పరిశీలన, గుర్తింపులు, ఎయిడెట్ పాఠశాలల వార్షిక ఇంక్రిమెంట్లు, ఎఎస్ రిటైర్‌మెంట్ ప్రతిపాదనలు తదితరాల్లో అక్రమాలు కోకొల్లలుగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలోనే విజయవాడ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ అర్బన్ (డిఐ) కార్యాలయం బంగారు గుడ్లుపెట్టే బాతులాంటిదనే చర్చ సాగుతోంది. ఈఅవకాశాన్ని ఉపయోగించుకునే స్కూటర్‌పై తిరిగే ఓ అధికారి కోట్లాది రూపాయలకు పడగలెత్తారనే ఆరోపణలున్నాయి. ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా విద్యాశాఖ మంత్రుల నుంచి కమిషనర్ స్థాయి వరకు ఉన్న అధికారులను ప్రసన్నం చేసుకుని 11 ఏళ్లుగా అక్కడే తిష్టవేశారనే చర్చ సాగుతోంది. ఈకార్యాలయంలో వసూళ్లను కట్టడి చేసేందుకు ప్రయత్నించిన ఓ జిల్లా స్థాయి అధికారిని సైతం 'ఈసార్' తన పలుకుబడి ఉపయోగించి బదిలీ చేయించారనే గుసగుసలు వినవస్తున్నాయి.

అక్రమ డిప్యూటేషన్‌కు రూ. 5 లక్షలు

విజయవాడ డిఐ కార్యాలయంలో పనిచేసే రికార్డు అసిస్టెంట్ దుర్గపై గతంలో ఆరోపణలు రావడంతో ఆమెను తిరువూరు జూనియర్ కళాశాలకు బదిలీ చేశారు. ఆ తర్వాత కౌన్సెలింగ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతిపై అంగలూరు డైట్ కళాశాలకు వచ్చారు. మళ్లీ డిప్యూటేషన్‌పై తిరిగి ఆమె విజయవాడ డిఐ కార్యాలయానికి వెళ్లారు. రెగ్యులర్ పోస్టులో డిఐ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తిని అంగలూరు డైట్ కళాశాలకు బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. గతంలోనే ఈ విషయం వెలుగులోకి రావడంతో డిప్యూటేషన్లు రద్దు చేసి కొద్దిరోజులు ఎవరి పోస్టుల్లో వారిని సర్దుబాటు చేశారు. అయితే 11 నెలల క్రితం జరిగిన కౌన్సెలింగ్‌లో దుర్గ ఆకునూరు జిల్లా పరిషత్ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. అయితే కొద్ది రోజులకే మళ్లీ డిప్యూటేషన్‌పై విజయవాడ డిఐ కార్యాలయానికి బదిలీ అయ్యారు. రెగ్యులర్ పోస్టులో డిప్యూటేషన్ వేయడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని విద్యాశాఖలో చర్చ జరుగుతోంది. విజయవాడ డిఐ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే వ్యక్తిని ఆటోనగర్‌లోని పుస్తక భాండాగారంలో ఉపయోగించుకోవాల్సిందిగా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. ఈఅక్రమ డిప్యూటేషన్ వ్యవహారంలో రూ.5 లక్షలు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈడిప్యూటేషన్ వ్యవహారమే అవినీతికి తార్కాణంగా ఉందని పలువురు చెవులు కొరుక్కుంటున్నారు.

అల్లరి మూకలు హాల్‌చల్

ఇద్దరికి కత్తిపోట్లు

ప్రజాశక్తి - వన్‌టౌన్: విజయవాడ వన్‌టౌన్లో అల్లరి మూకలు రెచ్చిపోయాయి. పూటుగా మద్యం తాగి ఒకరిపై ఒకరు దాడికి తెగబడ్డారు. ఫలితంగా ఇద్దరు కత్తిపోట్లకు గురై ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు రెండు ముఠాల మధ్య సినీ పక్కీలో ఈ వ్యవహారం సాగింది. ఇదంతా టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరగటం విశేషం. ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే... పాత బట్టల వ్యాపారాలు చేసుకుంటూ చిట్టినగర్ ఆంజనేయ వాగు సెంటర్ కొండ ప్రాంతంలో నివసించే రాపర్తి దుర్గేష్ తన అన్నయ్య సాంబతో కలిసి చిట్టినగర్ సెంటర్ వద్ద ఉన్నాడు. అదే సమయంలో అక్కడ ఉన్న గని అనే యువడికి పొరపాటున చెయ్యి తగలడంతో ప్రారంభమైన రభస చినికిచినికి కత్తిపోట్లకు దారితీసింది. తన ప్రాణ స్నేహితుడికి తగులుతావా అంటూ గని ఫ్రెండ్ హరి అనే యువకుడు సాంబపై చేయి చేసుకున్నాడు. దీంతో అవమానంగా భావించిన దుర్గేష్, సాంబా తమ మిత్ర బందంతో కలిసి గని బృందంపై దాడి చేశారు. స్థానికులు సర్దిచెప్పటంతో వెళ్లిపోయారు. అయితే ఆంజనేయ వాగు కొండపైన గొడవకు సంబంధంలేని దుర్గేష్ ఫ్రెండ్ సంతోష్‌ను గని మిత్ర బందం కొట్టడంతో తిరిగి రభస పెద్దదైంది. దీంతో ఇరువైపుల వారు మారణాయుధాలతో దాడులు చేసుకున్నారు. ఈ సంఘటన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. అనంతరం గురువారం రాత్రి 11 గంటల సమయంలో సంతోష్, గని పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశారన్న కోపంతో గణేష్ స్నేహితుడు హరి పంచాయితీ చేసుకుందామంటూ శుక్రవారం స్థానిక వైసిపి నేత కార్యాలయం వద్దకు తీసుకువెళ్లాడు. అక్కడ ఇరువైపుల వారి మధ్య చోటుచేసుకున్న వాదనలతో రెచ్చిపోయిన హరి విచక్షణ కోల్పోయి సంతోష్ స్నేహితుడు అఖిల్‌ను కత్తితో గాయపర్చాడు. అడ్డువచ్చిన తన స్నేహితడు శ్రీనివాసును కూడా గాయపరిచాడు. గాయపడిన ఇద్దరినీ విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు ఇరువైపుల వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ గొడవలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌కు సంబంధించిన వారు ఉన్నారని సోషల్ మీడియాలో వార్తలు హాల్‌చల్ చేశాయి.

గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌కు సంబంధం లేదు : ఎసిపి

టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి రెండు గ్రూపుల మధ్య జరిగిన దాడి సంఘటనలోని నిందితులు గంజాయి, బ్లేడు బ్యాచ్ సభ్యులు కాదని వెస్ట్ ఎసిపి కె.హనుమంతరావు తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియాలలో వచ్చిన కథనాల్లో వాస్తవం లేదన్నారు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు గ్రూపుల మధ్య గురువారం రాత్రి జరిగిన ఓ స్వల్ప వాగ్వాదం తారాస్థాయికి చేరుకుందని, దీంతో శుక్రవారం హరి అనే వ్యక్తి అఖిల్‌పై పదునైన ఆయుధంతో దాడిచేసి గాయపరిచాడని తెలిపారు. వీరిలో ఎవరికీ పాత కేసులు లేవన్నారు. మీడియా సమావేశంలో కొత్తపేట సిఐ ఎ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో రోడ్లు

- విజయవాడ - నూజివీడు రోడ్డు నిర్వహణలో నిర్లక్ష్యం
- నున్న - అంబాపురం రహదారి విస్తరణ ఎప్పుడో ?

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలంలో ప్రధాన రహదారుల వెంబడి ఆక్రమణలు పెరుగుతున్నాయి. ప్రధానంగా ఆర్ అండ్ బి రోడ్ పక్కనే దుకాణాలు, నివాసాలు వెలుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహారించడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నున్నలో విజయవాడ – నూజివీడు రాష్ట్ర రహదారి ఇప్పటికే పలుచోట్ల కుమించుకుపోయింది. నున్న అమెరికన్ ఆస్పత్రి సమీపంలో ఆక్రమణలు రోడ్డుపైకి వచ్చేశాయి. చివరకు శ్మశాన వాటికకు వెళ్లే మార్గం సైతం కనిపించని పరిస్థితి నెలకొంది. నున్న – అంబాపురం రోడ్డు పరిస్థితి కూడా అంతే. కానీ ఆర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్ల విస్తరణ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. దీర్ఘకాలంగా ప్రతిపాదనలు అమలకు నోచుకోవడంలేదు. గతంలో ఒకసారి అధికారులు రోడ్ల విస్తరణపై సర్వే నిర్వహించినా, ఆ తర్వాత పట్టించుకోవటం మానేశారు. దీనికితోడు రాజకీయ నాయకుల అండతో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. నున్న-అంబాపురం ఆర్ అండ్ బి రోడ్డు పక్కన పెరుగుతున్న ఆక్రమణల్లో గహాలు నిర్మిస్తున్నారు. దీనివల్ల తరచూ వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇప్పటికైనా స్పందించి ఆక్రమణలు తొలగించాలని, రోడ్లను విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

సూచక బోర్డులు కనిపించకుండా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు



ఆక్రమణకు గురైన రోడ్డు



కనిపించని సూచిక బోర్డులు

విజయవాడ – నూజివీడు ఆర్‌అండ్‌బి రోడ్డులో మలుపుల వద్ద సూచిక, హెచ్చరికల బోర్డులు కనిపించడంలేదు. దీంతో రోడ్డులో ఎక్కడ మలుపు ఉన్నదీ, ఎక్కడ క్రాస్ రోడ్లు ఉన్నాయో వాహనదారులకు తెలియడం లేదు. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నూజివీడు రోడ్డు నుంచి సూరంపల్లి పంచాయతీ పరిధిలోని రామచంద్రపాలెం వెళ్లేందుకు క్రాస్ రోడ్డు ఉంది. ఆ రోడ్డులో నుంచే నున్న బైపాస్‌కు వెళ్లవచ్చు. నూజివీడు – విజయవాడ బైపాస్ రోడ్డులో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీనివల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంది. క్రాస్ రోడ్డు వద్ద బారికేడ్లను కూడా ఏర్పాటు చేయలేదు. నూజివీడు రోడ్డులో చెట్ల వద్ద పెద్ద మలుపు ఉంది. అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపు వద్ద ఉన్న హెచ్చరిక బోర్డు పూర్తిగా పొదల్లో ఉండిపోయింది. దీంతో రాతివేళల్లో ఆ మలుపు వాహనదారులకు కనిపించడం లేదు. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ – నూజివీడు ఆర్‌అండ్‌బి రోడ్డు రాష్ట్ర హైవేగా మారింది. వాహనాల రాకపోకలు పెరిగాయి. కానీ ఈ రోడ్డు నిర్వహణను ఆర్ అండ్‌బి అధికారులు పూర్తిగా విస్మరించారు. ఇప్పటికైనా స్పందించి క్రాస్ రోడ్ల వద్ద సూచిక బోర్డు, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కనిపించేలా చేయాలని, రోడ్డు మార్జిన్‌కు రెండు వైపులా ఉన్న ముళ్ల పొదలు, పిచ్చి చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్యాస్ ధరలపై కొనసాగుతున్న నిరసనలు



కళావేదిక నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించనున్న కళావేదిక నిర్మాణ పనులకు శుక్రవారం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కొమరగిరి రామారావు, గజ కష్ణమూర్తిలు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతమ్మ అమ్మవారి దేవాలయ మాజీ ఛైర్మన్ లు వాసిరెడ్డి బెనర్జీ, కాకాని శ్రీనివాసరావు, గోపాలకష్ణమూర్తి, కర్ల వెంకటనారాయణ నల్లపునేని వెంకటనారాయణ , నూతలపాటి చెన్నకేశవరావు , మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు స్వామి గోపాలరావు లక్ష 116 రూపాయలు , యనమదల. వెంకట్ నారాయణ 1,0,00016 రూపాయలు, శ్రీనివాసరావు 1,000016 రూపాయలు విరాళాలను కమిటీ వారికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అవాస్తవాలు ప్రచారం చేయడం తగదు : టిడిపి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని మాజీ ఫ్లోర్ లీడర్ ఎలమంచిలి రాఘవ కార్యాలయంలో పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లు మాట్లాడుతూ ప్రెస్ మీట్‌లు పెట్టి మరి అవాస్తవాలు ప్రచారం చేయటం వైయస్సార్ పార్టీ వారికే సరిపాటన్నారు. ఛైర్మన్‌ని ప్రతి కౌన్సిల్ మీటింగ్ నందు అసమర్ధుడిగా చేసి ఇతర కౌన్సిలర్లు రాజకీయంగా లబ్ధి పొందాలని ఆశిస్తున్నారనీ, జరిగిన సంఘటనపై సీసీటీవీ ఫుటేజీ బయటపెట్టాలని అన్నారు.అలాగే ప్రజా సమస్యలపై ఎవరు పోరాడుతున్నారనే విషయంపై ప్రజల వద్ద చర్చ పెట్టాలని, ఆధిపత్య పోరు కోసం ఎవరు తాపత్రయపడుతున్నారనేది తెలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, సంగేపు బుజ్జి, కంచేటి గీతా రాణి, సామినేని మనోహర్, ఇర్రి నరసింహారావు, తెదేపా నాయకులు వేదులాపురి సైదేశ్వర రావు, కర్ల జోజి, మరేపల్లి.శౌరి, పున్నా ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు పరిశీలన

ప్రజాశక్తి -తిరువూరు : తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు జి.కెనడి, వ్యవసాయ అధికారిణి పి.పద్మలు వావిలాల రైతు భరో సా కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి రబి పంట నమోదు, ఈ-కెవైసి (పంట ధృవీకరణ) ను సమీక్షించారు. రైతు లంతా పంట నమోదు, పంట ధవీక రణ తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రా లలో చేయించుకోవడానికి ఈ నెల 4వ తేదీ ఆఖరని తెలిపారు. పంట నమో దు చేయించుకుని, ఈ-కెవైసి చేస్తేనే ప్రభుత్వ పథకాలకు అర్హులని వెల్లడిం చారు. రైతు భరోసా కేంద్ర పరిధిలోని రైతులకు 100 శాతం పంట నమోదు చేసి, ఈ-కెవైసి కూడా శనివారం నాటి కి పూర్తి చేయాలనిగ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు.

ఆర్థికసాయం అందజేత



ప్రజాశక్తి -తిరువూరు : ఆంధ్రప్రదేశ్ టైలర్స్ ఫెడరేషన్ తిరువూ రు కమిటీ ఆధ్వర్యంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి సహాయం అందజేసింది. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ మెకానిక్ జాదం సర్వేశ్వరరావు భార్యకు, వయోభారంతో బాధపడు తున్న సీనియర్ టైలర్ కోటేశ్వరరావుకు రూ.ఐదు వేలు చొప్పున కమిటీ సభ్యులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఫెడరే షన్ కమిటీ నాయకులు పి.తులసీ రాణి, నీలిమ, ఉషా, రాధిక, రజిత, వాణి, కటారి కష్ణ, యాకూబ్ పాల్గొన్నారు.


కృష్ణలంకలో...



వన్‌టౌన్‌లో..



తిరువూరులో...


సింగ్‌నగర్‌లో...


ఎ.కొండూరులో..



మైలవరంలో...


యనమలకుదురులో...

ప్రజాశక్తి-విజయవాడ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు, ఇతర భారాలకు వ్యతిరేకంగా సిపిఎం నిర్వహించే పోరాటాల్లోకి ప్రజలు కలిసి రావాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు పిలుపునిచ్చారు. పెంచిన గ్యాస్, పాల ధరలను రద్దు చేయాలని కృష్ణలంక 21వ డివిజన్ కల్పన ప్రింటర్స్ రోడ్డులో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధర పెంచి గ్యాస్ బండ ప్రజల నెత్తినవేశారని, మరలా పుల్లల పొయ్యే గతి అన్నట్లు పుల్లలపొయ్యిమీద వంట చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పెంచిన గ్యాస్, పాల ధరలను రద్దు చేయాలని, భారాలు మోపుతున్న బిజెపి-మోడీ డౌన్ డౌన్ అంటూ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టు నినాదాలు చేశారు. కార్యక్రమానుద్దేశించి బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, భారాలకు వ్యతిరేకంగా సిపిఎం దేశ వ్యాప్తంగా ఈ నెల మొత్తం పెద్ద ఎత్తున ప్రచారాందోళన కార్యక్రమాలను నిర్వహిస్తుందని, వీటిల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిశాయో లేదో వెంటనే గ్యాస్ ధరలను పెంచడం బిజెపి దివాళాకోరు పాలనకు నిదర్శనమని విమర్శించారు. పెరిగిన గ్యాస్ ధరల భారాలతో చిన్న చిన్న టిఫిన్ సెంటర్లు, టీ కొట్లు మూసుకునే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆదాయాలు పెరిగే చర్యలు మానుకొని, ప్రజల ఆర్థిక పరిస్థితులను దెబ్బతీసే విధంగా బిజెపి-మోడీ చర్యలు ఉంటున్నాయని ధ్వజమెత్తారు. ఇప్పటికే దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచిపెట్టారని అన్నారు. ప్రధాని మోడీ బాటలోనే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నడుస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలపై భారాలు మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాధ్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలుగా తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు. సిపిఎం తూర్పు నగర కార్యదర్శివర్గ సభ్యులు పుప్పాల కృష్ణ, నాయకులు కోరాడ రమణ, శివాజి, లక్ష్మీనారాయణ, కుమార్, నాగరాజు, బి భారతి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-సింగ్‌నగర్ :** దేశ సంపదను అదాని అంబానీలకు కట్టబెడుతున్న బిజెపి ప్రభుత్వం కట్టబెడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రకాష్ నగర్ సెంటర్లో కార్మికుల అడ్డా వద్ద నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబురావు పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంలో సామాన్యులు బతకలేని పరిస్థితినెల కొందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు, కే దుర్గారావు, నగర కమిటీ సభ్యులు, సిహెచ్ శ్రీనివాస్, ఎస్ కే, పీరుసాహెబ్, నాయకులు ఎస్ కె నిజాముద్దీన్, ఎల్, శివలింగేశ్వరరావు, రామాంజనేయులు, పి సాంబిరెడ్డి, అప్పన్న పాల్గొన్నారు. **ప్రజాశక్తి మైలవరం :** నూజివీడు రోడ్ లోని స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రావు రమేష్ బాబు మాట్లాడారు. రైసింగ్ మండల కార్యదర్శి సిఐటి మండల కార్యదర్శి చాట్ల సుధాకర్ కౌలు రైతు సంఘం కార్యదర్శి ఎస్ ఎస్ ఆర్ సిపిఎం మైలవరం శాఖ కార్యదర్శి దేవేంద్రనాథ్ సిపిఎం నాయకులు షేక్ అల్లాబక్ష నాగరాజు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - తిరువూరు :** సిపిఎం, మహిళా సంఘం అధ్వర్యంలో తిరువూరు పట్టణంలోని 10వ వార్డు సుందరయ్య కాలనీ, ఎన్ ఎస్పీ కాల నీలో మహిళలు, పార్టీ కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేశారు. కేంద్ర ప్రభు త్వం పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలను మోపుతుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.వెంకటేశ్వరరా వు, డి.శివరా మకష్ణ, చెరుకు సత్యనా రాయణ, ఐద్వా జిల్లా నాయకురాలు ఎస్.కుమా రి, కార్యకర్తలు దమ్మాలపా టి శివనాగేం ద్రమ్మ, జాన్ బి, వెంకట లక్ష్మి, ఎం.లక్ష్మి, తోట శిరీష, రాణి, సుబాని, కుమారి, రమణమ్మ, మని మ్మ, దుర్గా, అంజలి, కష్ణ కుమారి, ఖాసీంబి, నాగమణి తదితరులు పాల్గొ న్నారు. మధిర రోడ్డు దళిత పేటలో సిపిఎం ముఠాశాఖ ఆధ్వర్యంలో మహి ళలు ఆందోళన చేశారు. ఈకార్యక్రమం లో ఐద్వా నాయకులు మరియమ్మ, మరకాల శిరీష, కళావతి, జవలమ్మ, ధనమ్మ, దయమ్మ, భారత ,లక్ష్మీ, యశోద జ్యోతి, రాణి, భారతి, మేరీ తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరువూరు మండలం వామకుంట్ల గ్రామంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, మహిళలు గ్యాస్ ధరలు తగ్గించాలని ఆందోళన చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, నాయకులు వి.రంగ య్య, బి.సుందరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - వన్‌టౌన్ :** పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సిపిఎం పశ్చిమ సిటీ ఆధ్వర్యంలో ముఠా కార్మికులతో కలిసి శుక్రవారం వన్‌టౌన్ సామారంగం చౌక్ సెంటర్ నందు నెత్తిమీద గ్యాస్ బండ పెట్టుకుని వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోడీ నెల నెలా వంట గ్యాస్ ధరలను పెంచుకుంటూ పోతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని,. లేదంటే రానున్న రోజుల్లో ప్రజలను కలుపుకుని ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి. వెంకటేశ్వరరావు (చౌదరి), బి. శ్రీను, రాజయ్య, మాల్యాద్రి. ముఠా కార్మికులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఏ.కొండూరు :** మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గంపలగూడెం నూజివీడు రహదారిపై చీమలపాడు కొత్తూరు సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా ఏ కొండూరు మండల కార్యదర్శి ఆళ్ళ ఉమాదేవి, కార్మిక సంఘం మండల కార్యదర్శి పానేం ఆనందరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలపై భారాలు మోపుతూ పారిశ్రామికవేత్తలకు పన్నులు రాయితీలు కల్పిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు మరీదు కుమారి మేకల సరోజిని నీలిమ మేకల ప్రతిభ పద్మ కొర్లపాటి దయామని కొర్లపాటి శాంతమ్మ మరియమ్మ పాల్గొన్నారు

యనమలకుదురులో వినూత్న నిరసన

పెనమలూరు : పెనమలూరు మండలం యనమలకుదురులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఐద్వా ఆధ్వర్యాన శుక్రవారం నిరసన తెలిపారు. గ్యాస్ సిలిండర్‌ను పక్కన పెట్టి కట్టెల పొయ్యిపై వంట చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జయలక్ష్మి, పట్టణ కమిటీ అధ్యక్షులు షేక్ వల్లిమ్మ, కార్యదర్శి పాతాళ లక్ష్మి, ఐద్వా కమిటీ సభ్యులు షేక్ జాన్‌బి, రంగనాయకమ్మ, టి పద్మావతి, షేక్ ఖాసీంబి, ఎం.రవణమ్మ పాల్గొన్నారు.

హక్కుల కోసం మహిళల ఐక్యంగా పోరాడాలి

- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కె శ్రీదేవి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని డివిఆర్ నగర్ లో సుందరయ్య భవన్ నందు సిఐటియు, ఐద్వా, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, ఆశ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వంటి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు ఐద్వా మండల కార్యదర్శి దంతాల రాజేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కె శ్రీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అయినప్పటికీ నేడు మహిళలు వివక్షతకు గురవుతున్నారు అన్నారు. బిజెపి పాలిత ప్రాంతంలో నేడు మహిళలపై, చిన్న పిల్లలపై మానభంగాలు, హత్యలు జరుగుతున్నప్పటికీ కేసులు లేకుండా వారికి శిక్షలు పడకుండా చేయడం దుర్మార్గమన్నారు. కులం, మతం పేరుతో మహిళలపై దాడులు జరుగుతున్నాయని, ఇటీవల కాలంలో ఒక బిజెపి ఎంపీ సతీసహగమును మళ్ళీ పెట్టాలని అనడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. నేడు బిజెపి ఫ్యూడల్ భావజాలంతో పరిపాలిస్తుందని, కోట్ల రూపాయలు పేదల వద్ద కొల్లగొట్టి బడా పారిశ్రామిక వ్యక్తులకు పెడుతుందన్నారు. మహిళల హక్కులను పోరాట ఫలితంగానే సాధించుకున్నామన్నారు. నేడు మహిళలను ఓటు బ్యాంకుగా పాలకులు వాడుకుంటున్నారని, ఈ విధానాలను తిప్పి కొట్టాలన్నారు. రాబోయే కాలంలో మహిళల హక్కులు సాధించుకొనుటకు మహిళలందరూ ఐక్యంగా పోరాటం చేయాలని అన్నారు.


మాట్లాడుతున్న శ్రీదేవి

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె కముల, ఐద్వా నాయకురాలు సోమోజు నాగమణి, రైతు సంఘం నాయకులు కె లింగారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కోట కష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, ప్రత్యూష, ఆశ వర్కర్లు సుధారాణి, వెంకటరమణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎలకమ్మ, రంగమ్మ, సిఐటియు మండల అధ్యక్షులు షేక్ గౌస్ మియా, ఎస్ రామనాథం పాల్గొన్నారు.

నీటిపారుదల పనులు పూర్తి చేయాలి

- కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : పరిశోధన, పరిశీలన దిశగా నీటిపారుదల శాఖలో విద్యాధికులైన ఇంజనీర్లు ఆలోచించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపు నిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్లోని స్పందన సమావేశం మందిరంలో నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాలో నీటిపారుదల శాఖలో మిగిలిన నిర్వహణ పనులు పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో రిజిస్టర్ అయిన ఆయకట్టు 5,86,692.9 ఎకరాలు ఉందని, ఇందులో ధాన్యం పండే భూమి 4,86070.7 ఎకరాలు కాగా, చెరకు పండే భూమి 1172.5 ఎకరాలు, అలాగే ఆక్వా సాగు చేసే 97832.0 ఎకరాల భూమి ఉందని అన్నారు. కెఈ డివిజన్ పరిధిలో ఉప్పులూరు, ఆత్కూరు, అప్పర్ పామర్రు, లోయర్ గుడివాడ, జొన్నపాడు, వెంట్రప్రగడ, కౌతవరం, గుడ్లవల్లేరు, కత్తివెన్ను, బంటుమిల్లి సెక్షన్ల అసిస్టెంట్ ఇంజనీర్లను ఆయా పరిధిలోని పనుల పురోగతిని కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బుడమేరు పనులలో పురోగతి లేకపోవడంపై సంబంధిత డి ఈ ని కలెక్టర్ ప్రశ్నించారు. కైకలూరు మచిలీపట్నం కేసి డివిజన్ దివి సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పనులపై సంబంధిత ఇంజనీర్లను వివరాలు పురోగతి పై సమీక్షించారు. జిల్లాలో నీటిపారుదల శాఖకు సంబంధించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ ఈ తిరుమల రావు డి ఈ శ్రీనివాస్, కేఈ డివిజన్ ఎస్ఈ కె. బాబు, పలు డివిజన్ల ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా



ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల వినతి

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలంలో ఆర్.బి.కె. ద్వారా ధాన్యం కొనుగోలు నిలిపివేసి ఇప్పటికి సుమారు నెల రోజులు పైనే అయిందని, వెంటనే ధాన్యం కొనుగోలును ప్రారంభించాలని పలువురు రైతులు తహసీల్దార్ రామానాయక్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 75 కేజీలకు 1545 రూపాయల గిట్టుబాటు వున్న ధరను రైసు మిల్లర్లు 13 లేక 14 వందలకు కొనుగోలు చేస్తున్నారని, దీంతో తాము భారీగా నష్టపోవుతున్నామన్నారు. ఎకరానికి రూ.45 వేల రూపాయలను ఖర్చు చేసి పంట పండించామని, ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే నష్టములన్నింటిని భరిస్తూ పంట పండించగా ధాన్యం కొనుగోలును నిలిపివేయటం దారుణం అన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను మొదలు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు మిక్కిలినేని మధు, అయినపూడి విజయ్ కుమార్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గొర్రెపాటి చంటిబాబు, గొర్రెపాటి సురేష్, గొర్రెపాటి సురేంద్ర, గొర్రెపాటి శ్రీను, గొర్రెపాటి మధు తదితరులు ఉన్నారు.

ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : ఆర్వే ఫౌండేషన్ ద్వారా ఆర్‌సిఎం చర్చ్ స్నేహాలయ వద్ధాశ్రమంలో వద్ధుల కొరకు ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్‌ను జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ ప్రారంభించారు. వృద్ధులకు సేవ చేయటం మన వంతు సహాయ సహకారాలు అందించడం మన తల్లిదండ్రులకు సేవ చేయడమేనని మన ఆదాయంలో కొంత భాగాన్ని ఇటువంటి సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ సమాజంలో పేదల పట్ల మానవత్వం తో మెలగాలని అన్నారు. ఆశ్రమ ప్రతినిధులు, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మైకేల్ ,నరసింహ ఆశ్రమ ప్రతినిధులు,సిస్టర్ జిమ్మి తదితరులు పాల్గొన్నారు.

నాంచారమ్మ దేవస్థానం హుండీ ఆదాయం రూ.2.80 లక్షలు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామములో వేంచేసియున్న శ్రీ అద్దంకి నాంచారమ్మ తల్లి దేవస్థానంనకు సంబంధించి 93 రోజులకుగాను హుండీలు లెక్కించగా రూ. 2,80, 773 వచ్చాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి సీతా రామయ్య తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో దేవదాయ ధర్మదాయశాఖ తనిఖీదారు కె.శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులు, రాంప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.



'చలో ఢిల్లీ'పై కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉయ్యూరు : గ్రామీణ ఉపాధి కార్మికులకు ఏడాదికి 200 రోజులు పని దినాలు ,కల్పించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాజేష్ అన్నారు. కేంద్రం మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ ఐదో తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని కార్మిక కర్షిక పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి పథకం ద్వారా 600 రూపాయలు వేతనం చెల్లించాలని అన్నారు. ఉయ్యూరు మండలం కలవపాముల గ్రామంలో సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో దళితవాడలో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, బిజెపి విధానాలు నశించాలని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు నెలకి 26000 ఇవ్వాలని, పెన్షన్ 10000 రూపాయలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ టైం స్కేల్ స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. .రైతుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయ కులు అనే సుబ్బారావు, కౌలు రైతుల సంఘం ది.జాన్ కోటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వీరమ్మ, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయ కులు సుబ్బారావు, కోటేశ్వరమ్మ, వ్యవసాయ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన ఎంఎల్ఎ రమేష్‌బాబు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : తన్నీరు

ప్రజాశక్తి-చల్లపల్లి : రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. చల్లపల్లి మండలం కొత్తమాజేరులో శుక్రవారం రూ.32.50 లక్షలతో నూతనంగా నిర్మించిన పిఏసిఎస్ భవనాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్, పెడన నియోజకవర్గ పరిశీలకులు తన్నీరు నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ రూ.10 కోట్లతో సహకార భవనాలు నిర్మిస్తున్నామన్నారు. రూ.100 కోట్లతో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అన్ని కేడీసీసీ బ్యాంక్ శాఖలకు స్వంత భవనాలు నిర్మాణంతో పాటు, నష్టాల్లో ఉన్న పిఏసిఎస్ లకు నూతన జవసత్వాలు కలిగించినట్లు తెలిపారు. పిఏసిఎస్ ద్వారా రైతులకు ప్రయోజనాలు, డ్వాక్రా సంఘాలకు రుణాలు, లాకర్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.కేడీసీసీబీ చైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాల మేరకు సహకార వ్యవస్థ బలోపేతానికి తాము చేస్తున్న కృషిని వివరించారు. 1902లో ఆవిర్భవించిన మాజేరు పిఏసిఎస్ 2019కి ముందు రూ.9 కోట్ల టర్నోవరుతో ఉంటే, ఇప్పుడు ఏకంగా రూ.19 కోట్ల టర్నోవరుకు చేరిందన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కేవీ వెంకటేశ్వరరావు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ పెద వీరయ్య, కొత్తమాజేరు పిఏసిఎస్ చైర్మన్ అరజా శివశంకర్, మండల వైఎస్ఆర్ సీపీ ఇంచార్జి ఇంకొల్లు శేషగిరి, ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకనాథ్, తమ్ము లక్ష్మి, కర్రా రవి, నూకల వెంకటేశ్వరరావు, సర్పంచులు కళ్లేపల్లి లక్ష్మి, వల్లూరు ఉమా, కొల్లూరి కోటేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, ఏఓ సాయిసింధు, సబ్ డివిజన్ కో ఆపరేటివ్ అధికారి డి. నాగమల్లేశ్వరరావు, కేడీసీసీ బ్యాంక్ బీఎం యలవర్తి నగరాజ కుమారి, సొసైటీ చైర్మన్లు పాగోలు ఫణి, శీరం నాని, హనుమానుల బెనర్జీ, యార్లగడ్డ సత్యాంజనేయ ప్రసాద్, వంగల శ్రీరామమూర్తి, సీతఊటలు ఎస్ఎస్ చక్రపాణి, తోట కృష్ణారావు, కంఠంనేని నాగేశ్వరరావు, లంకపల్లి రమేష్, గ్రామ సచివాలయ కన్వీనర్ల, గృహసారథుల నియోజకవర్గ కన్వీనర్ మద్ది చిన్నా, మండల కన్వీనర్ యడ్ల జగదీష్, పార్టీ నాయకులు వెనిగళ్ల జగదీష్, బొందలపాటి లక్ష్మి, కల్లేపల్లి లక్ష్మీనారాయణ, తమ్ము మనోజ్, బెల్లపు హరిబాబు, ఏఎంసీ డైరెక్టర్లు మోతుకూరి కొండలు, అబ్దుల్ అర్షద్, సొసైటీ త్రిసభ్య కమిటీ పర్సన్లు, పాల్గొన్నారు.

ఈ క్రాప్, ఈకెవైసి పూర్తిచేయాలి : జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో రబీ పంట కాలంలో వివిధ వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగుచేసిన రైతులు మార్చి 4 లోగా ఈ-క్రాప్, ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా.అపరాజిత సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు చేపట్టిన ఈ-క్రాప్ యాప్ లో రైతుల సాగు వివరాల నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ ఈ నెల 4వ తేదీతో ముగియనున్నదని ఆమె తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 3,13,404 ఎకరాలలో సాగుచేసిన వివిధ పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయగా అందులో 2,94,307 ఎకరాలలో 1,09,381 మంది రైతులకు ఈ-కేవైసీ పూర్తయ్యిందని, మిగిలిన రైతులు కూడా త్వరితగతిన రైతు భరోసా కేంద్రాలలోని వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులను సంప్రదించి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. ఆధార్ లింక్ చేయబడిన మొబైల్ నెంబరుకు పంపబడిన ఓటీపీ ద్వారా కూడా ఈ-కేవైసీని చేయించుకోవచ్చని జెసి తెలిపారు.

ఉపాధి పనుల లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలి

- డ్వామా పీడీ సూర్యనారాయణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల లక్ష్య సాధనపై అధికారులు దృష్టి పెట్టాలని డ్వామా పీడీ జీవీ. సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్పందన సమావేశపు మందిరంలో ఆయన గ్రామీణ ఉపాధి హామీ పనులు లక్ష్య సాధనపై జిల్లాలోని ఎంపిడిఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉపాధి హామీ పనులు లక్ష్య సాధనలో జాతీయ స్థాయిలో మెరుగైన స్థానంలో ఉన్నామని, జిల్లా విభజన అనంతరం ఈ విషయంలో వెనుకబడ్డామని అన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్న ఎంపిడిఓలు ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్లను సమన్వయ పరచుకుంటూ ఉపాధి హామీ పనుల లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో మార్చి నెలకు సంబంధించి ఉపాధి హామీ కూలీలకు మూడు వారాలకు గాను 18 లక్షల పని దినాలను కల్పించాల్సి ఉందని, ఈ లెక్కన వారానికి 6 లక్షలు, రోజుకు లక్ష చొప్పున పని దినాలు కల్పించాలని, లక్ష్యాన్ని పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని కోరారు. అందుకు గ్రామాల్లోని వాలంటీర్ల సహాయాన్ని తీసుకోవాలన్నారు. రబీ పంట కాలం పూర్తి కావడం, కాలువలు ఆరిపోయి ఉండటంతో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పనులను నిత్యం పర్యవేక్షించేలా క్షేత్రస్థాయిలో సందర్శించాలని అధికారులకు సూచించారు. అమత్ సరోవర్ కింద చేపట్టిన 34 చెరువులను ఇప్పటికే పూర్తి చేశామని, మిగిలిన 46 చెరువులను ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేయాలని చెప్పారు. కూలీల పనిపుస్తకంతో ఆధార్ అనుసంధానం ప్రక్రియ వంద శాతం సాధించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓలు, ఏపిఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-బంటుమిల్లి : మండలంలో నాగేశ్వరావుపేట పంచాయితీ లక్ష్మీనా రాయణ పురం గ్రామంలో ఇటీవల మరణించిన గూడవల్లి మాధవరావుకు వైఎస్సార్ బీమా కింద మట్టి ఖర్చుల నిమిత్తం పది వేల రూపాయల నగదును బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చిన్నబాబు అందించారు. నాగేశ్వరావుపేట ఇంచార్జ్ యనుములకొండ లక్ష్మణ, పోలగాని వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

నూతన వస్త్రాల అందజేత

ప్రజాశక్తి-మొవ్వ : శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి వార్ల 260 వ వార్షిక కళ్యాణ మహోత్సవాలలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం దేవరలకు ఉభయ దాతలు కూచిపూడి నాట్యాచార్యులు, నాట్య లెజెండ్ పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం, స్వరాజ్యలక్ష్మి దంపతుల మనవడు అనీష్, మనుమరాలు లక్ష్మీకామేశ్వరి(చెన్నై) దేవాలయ పాలకమండలికి నూతన వస్త్రాలను అందజేశారు.. అర్చకులు వాటిని అమ్మవారికి అయ్యవారు మూల విరాటులకు, ఉత్సవ మూర్తులకు అలంకరించి పెండ్లి కూతురు పెళ్లి కుమారునిగా తీర్చిదిద్దారు.

సాగర్ జలాలు కోరుతూ రైతుల రాస్తారోకో



ప్రజాశక్తి-ఎ.కొండూరు: రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పోరాటాలతో గుణపాఠం చెప్పాలని ఎపి రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పి.వి.ఆంజనేయులు పిలుపునిచ్చారు. జమలాపురం మేజర్ కాల్వకు నాగర్జున సాగర్ జలాలను విడుదల చేయాలని, ఎండిపోతున్న పంటలను కాపాడాలని కోరుతూ విజయవాడ-భద్రాచలం రహదారిపై శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం మేజర్ కాలువకు జమలాపురం మేజర్ కాల్వకు గత మూడు సంవత్సరాలుగా సాగర్ జలాలను విడుదల చేయలేదన్నారు. దీంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. సాగర్ జలాలు వస్తాయనే నమ్మకంతో వరి, మొక్కజొన్న, మిర్చి, మామిడి తోటలను రైతులు సాగు చేశారని, పంటలు చేతికందే సమయంలో నీరు లేక ఎండిపోతున్నాయని చెప్నారు. ప్రభుత్వాలు అవలంభిస్తోన్న విధానాల వల్ల రైతులు కూలీలుగా మారుతున్నారని, వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకపక్క తెగుళ్లు మరోపక్క పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతుల పరిస్థితి నానాటికి దయనీయంగా మారుతోందన్నారు. ఈ ప్రాంతానికి సాగర్ జలాలు తీసుకొచ్చే బాధ్యత ఎమ్మెల్యేకు లేదా అని ప్రశ్నించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి రాస్తారోకో బలవంతంగా విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల సీతారామిరెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి ఆళ్ల అమ్మిరెడ్డి, అధ్యక్షుడు బొమ్మిన శ్రీను, సనగల రామకృష్ణారెడ్డి, పానెం ఆనందరావు, సిఐటియు మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు పంబి వెంకటేశ్వరరావు, గొల్లమండల తండా సర్పంచ్ డి.రాముడు, యోహాను ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కలతో ప్రజలు బెంబేలు

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కలు, కోతుల బెడద రోజురోజుకు పెరుగుతుంది. రాత్రి - పగలు తేడా లేకుండా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచారం చేస్తూ ప్రజలను ఆంధోళనకు గురి చేస్తున్నాయి. అలాగే కోతలు సైతం ఇళ్లల్లోకి ప్రవేశించి భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా కుక్కల వలన వాహనదారులు, పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. చేతిలో తినుబండారాలతో వెళ్లే చిన్న పిల్లల చుట్టూ వీధి కుక్కలు వెంటబడుతున్నాయని, ఏ సమయంలో ఏం జరుగుతుందో భయంగా ఉందని తల్లిదండ్రులు బెంబేలెత్తుతున్నారు. కనుక సబంధిత గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కలను, కోతులను పట్టి దూరంగా వదిలి వేయాలని ప్రజలు మొరపెట్టుకున్నారు.





మాట్లాడుతున్న సైదులు

చలో ఢిల్లీని జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-నందిగామ: ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో అసంఘటిత రంగ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం ఎన్టిఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, సిఐటియు నందిగామ కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదనంతా కార్పొరేట్లకు దోచిపెడుతుందన్నారు. దేశ ప్రజలపై మరింత పన్నుల భారం మోపి మధ్యతరగతి, సామాన్య ప్రజలు జీవించలేని స్థితికి తీసుకొస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ ఆస్తులను ప్రైవేటుపరం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎర్ర శీను, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి కొల్లి సరళ, మధ్యాహ్నం భోజనం నాయకులు ఆ దూరి సుశీల, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగమణి, తిరుమల దేవి, వనజ, వీఆర్‌ఏ సంఘం నాయకులు కుక్కల శీను, మున్సిపల్ నాయకురాలు పుట్టా మాణిక్యం, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ హస్సన్ పాల్గొన్నారు.

దిగొచ్చిన న్యూకాన్ బ్రిక్స్ యాజమాన్యం

కార్మికుని కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకారం

ప్రజాశక్తి-కంచికచర్ల

న్యూకాన్ బ్రిక్స్ కంపెనీ బర్రి ట్యాంక్‌లో పనిచేస్తూ ప్రమాదవశాత్తూ మృతిచెందిన పరిటాల గ్రామానికి చెందిన పాలంకి హరికృష్ణ కుటుంబానికి నష్టపరిహారం అందించాలని శుక్రవారం కంపెనీ గేటు ముందు ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనకు సిఐటియు, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, నాయకులు కోట కళ్యాణ్ మాట్లాడుతూ కార్శిక చట్టాల ప్రకారం మతుని కుటుంబానికి ప్రభుత్వం ఇన్సూరెన్స్, పియఫ్ తదితర నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే కంపెనీ యాజమాన్యం కూడా ప్రమాదానికి బాధ్యత వహిస్తూ నష్ట పరిహారంతో పాటు మతుని భార్యకు కంపెనీలో ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, పరిటాల మాజీ సర్దార్ కులు మాగంటి బాబు, మాజీ ఎంపిటిసి మాగంటి పుల్లారావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ మాగంటి అబ్బాయి తదితరులు ఆందోళనకు మద్దతు తెలిపారు. నందిగామ రూరల్ సిఐ ఐవి నాగేంద్రకుమార్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి పరిస్థితి వివరించారు. దీంతో మతుడి తరుపున టిడిపి నాయకులు, కంపెనీ సిబ్బంది చర్చలు జరిపారు. మతుడు హరికష్ణ కుటుంబానికి కార్మిక చట్టాల ప్రకారం అందాల్సిన రాయితీలు వచ్చే ఏర్పాటు చేయటంతో పాటు, యాజమాన్యం తరుపున రూ.15 లక్షలు చెల్లించేందుకు అంగీకరించారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు. శనివారం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.



కంపెనీ వద్ద ఆందోళన

కెజిబివి పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-గంపలగూడెం: శుక్రవారం నాడు స్థానికంగా ఉన్న కేజీబీవీ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి బి సోమశేఖర్ నాయక్ సాధారణ తనిఖీ నిర్వహించారు. ఉపాధ్యాయుల పనితీరు, లెసన్ ప్లాన్, విద్యార్థుల సామర్థ్యం, విద్యా బోధన, తదితరాలు పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పదార్థాలు పరిశీలనతో పాటు విద్యార్థులతో సహపంక్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోక్షగుండం వెంకటలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు



నెమలి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-గంపలగూడెం: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెమలి శ్రీ వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుండి 10వ తేదీ వరకు జరుగునున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఏర్పాట్లను డిసిపి మేరీ ప్రశాంతి పరిశీలించారు. అనంతరం ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ భీమరాజు, ఎస్సై సతీష్ కుమార్, ఎంపీడీవో వైపి రెడ్డి, ఈవో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం బకాయిలు చెల్లించాలి : టిడిపి

ప్రజాశక్తి-నందిగామ: ధాన్యం రైతుల బకాయిలు తక్షణమే చెల్లించాలని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు (బుజ్జి) డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్‌కు ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని శుక్రవారం ఆయన వినతిపత్రం అందజేశారు. నందిగామ మండలంలో దాదాపుగా 10 కోట్ల రూపాయల విలువ చేసే ధాన్యాన్ని రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి అమ్మారని తెలిపారు. రకరకాల సాకులతో ధాన్యం సొమ్ములు చెల్లించడంలేదన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ వాహనాల వినియోగం అనివార్యం

ప్రజాశక్తి-వన్‌టౌన్: దేశంలో పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయ ఇంధన వనరుల పొదుపు నేపథ్యంలో విద్యుత్ వాహనాల వినియోగం అనివార్యమని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వరంగల్) ఆచార్యులు డాక్టర్ వినయ్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో 'కంట్రోల్ ఆఫ్ ఎలక్ట్రిక్ మోటార్ డ్రైవ్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్ అప్లికేషన్స్' అంశంపై శుక్రవారం వెబినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ ప్రపంచీకరణ, ఆధునీకరణ నేపథ్యంలో విద్యుత్ వాహనాల వినియోగం ప్రాధన్యత పెరిగిందన్నారు. సంప్రదాయ ఇంధన వనరుల కొరత, వాటి వినియోగం వలన పెరిగే కాలుష్యంతో సమాజానికి తీవ్రమైన ప్రమాదాలు కలుగుతున్నాయన్నారు. ఆ క్రమంలో సంప్రదాయేతర ఇంధన వనరులను పెంపొందించుకోవాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ దష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, విభాగాధిపతి డాక్టర్ రాజేంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతాంజలిశాస్త్రి పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 20 మంది ఉద్యోగాలు

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: ఎనికేపాడులోని ఎస్ఆర్‌కె ఫౌండేషన్ విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో బెంగళూరుకు చెందిన మెడి అసిస్ట్ పిపిఎ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. కళాశాల నుండి 81 మంది విద్యార్థినిలు పాల్గొన్నారని వీరిలో 20 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె పద్మలత తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది.





ఫుడ్ కమిషన్ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి-మైలవరం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ, రేషన్ షాపులు, గురుకుల పాఠశాలలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి బందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా భోజనం తిని పరిశీలించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు, వంట ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక తదితరులు పాల్గొన్నారు.

వికాస్‌లో వికసిత్ ఫెస్ట్

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: నున్న వికాస్ విద్యాసంస్థలో వికసిత్ ఫెస్ట్ 2023ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భగా కళాశాల చైర్మన్ ఎన్.నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలోని సాంకేతిక పరిజ్ఞానం, నేటి నవతరానికి అవసరమన్నారు. అనంతరం విద్యార్థులకు, క్విజ్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, రోబోరెస్ తదితర పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ ఎన్.సత్య నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్స్ బి.రమణ, రామ్మోహన్‌రావు, కిశోర్‌బాబు, వికసిత్ కన్వీనర్స్ బి.వి.రెడ్డి, బి. సురేష్ పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-విజయవాడరూరల్: గ్రామాల్లో జొన్న పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. నున్న రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ కాటూరి సరళ అధ్యక్షతన గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. జొన్న పైరుకు రెండో దఫా కింద యూరియా అధికంగా వాడుతున్నారని, దీని వల్ల తెగుళ్ల వచ్చే ప్రమాదం ఉందని విఎఎలు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పోలారెడ్డి రమేష్‌రెడ్డి, సభ్యులు చాగంటి వెంకటరెడ్డి, గుడిసె దాసు, లింగమర్ల రామకృష్ణ, యలమర్తి మరియదాసు, అంగజాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.43 లక్షలతో సొసైటీ భవనం

ప్రజాశక్తి-విజయవాడరూరల్: కుందావారి కండ్రిక వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం నూతన భవనాన్ని రూ.43 లక్షలతో నిర్మాణం చేయనున్నట్లు సొసైటీ చైర్మన్ మూళగోళ్ల రవీంద్రరెడ్డి తెలిపారు. నిర్మాణ పనులకు శుక్రవారం సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శైలేజా, విజయవాడ రూరల్ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

వెండి తాపడం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ అంకమ్మ అమ్మవారి ఆలయ వెండి తాపడం నిర్మాణానికి విజయవాడ శాంతి న్యూరో సెంటర్ వైద్యులు కొల్లి క్రాంతికిషోర్, శైలజ దంపతులు శుక్రవారం ఆలయ చైర్మన్ చెన్న కేశవరావుకు లక్ష రూపాయల విరాళం అందజేశారు. అంతకుముందు వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు కోటేశ్వరరావు, సీతా రామారావు, ఆలయ ఇన్స్పెక్టర్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

నేటి నుంచి గుడివాడకు బస్సుసర్వీసు

ప్రజాశక్తి-అవనిగడ్డ

ఇటీవల నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో భాగంగా ప్రయాణికుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి ప్రతిరోజూ రాత్రి తొమ్మిది గంటలకు అవనిగడ్డ నుంచి గుడివాడకు బస్ సర్వీస్ నడుపుతున్నట్లు అవనిగడ్డ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రతిరోజూ సాయంత్రం 7.10 గంటలకు ఆఖరి బస్సు సర్వీసు నడుపుతున్నట్లు తెలిపారు. దీనితో ప్రయాణికుల నుండి వచ్చిన విజ్ఞప్తి మేరకు శనివారం నుండి ఈ అదనపు బస్ సర్వీసును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కోడూరు నుండి మియాపూర్ వరకు నడుపుతున్న సూపర్ లగ్జరీ సర్వీసును ప్రయాణికుల సౌకర్యార్థం బీహెచ్ఈఎల్ వరకు పొడిగించామని వివరించారు. ఈ మార్పులను గమనించి ప్రయాణికులు ఈ సర్వీసులను ఉపయోగించుకొని ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోవాల్సిందిగా డిఎం హనుమంతరావు కోరారు.

10 నుంచి ఉమెన్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి-గన్నవరం

ఈనెల 10 నుంచి కాకినాడలోని లేడీస్ క్లబ్‌లోని ద్రోణ అకాడమీలో జరగబోయే 9వ రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్, ఉమెన్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని కార్యదర్శి సతీష్ బాబు తెలిపారు. ఎన్ఎస్ఎన్ఐఎస్ ఫెన్సింగ్ కోచ్ ఎన్.సిహెచ్.రామ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా సీనియర్ ఫెన్సింగ్ టీం సెలెక్షన్స్ ఆదివారం ఉదయం 9 గంటల నుండి దావాజిగూడెంలోని ఎస్.వి. ఆర్ ఫంక్షన్ హాలులో జరుగుతాయని పేర్కొన్నారు. ఇందులో విజేతలకు రాష్ట్ర పోటీల్లో పాల్గొనే అర్హత లభిస్తుందని తెలిపారు. ప్రతి ఫెన్సింగ్ క్రీడాకారులు ఫెన్సింగ్ అసోసియేషన్ అఫ్ ఇండియా వారి వెబ్ సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 1 నాటికి 13 సంవత్సరాలు పూర్తయిన వారు 18 సంవత్సరాల పైబడిన వారు గతంలో ఆడిన ఫెన్సింగ్ సర్టిఫికెట్ లేదా సర్టిఫైడ్ ఫెన్సింగ్ కోచ్ వద్ద కనీసం ఏడాదిపాటు ఫెన్సింగ్ గేమ్ ప్రాక్టీస్ ఎక్స్పీరియన్స్ సర్టిఫికేట్‌తో పాటుగా ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం,5పాస్పోర్ట్ సైజ్ ఫొటోలు, వారి వ్యక్తిగత ఫెన్సింగ్ క్రీడా పరికరాలతో (ఎక్విప్మెంట్) హాజరు కావాలని ఉమ్మడి కృష్ణాజిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి నాగం సతీష్‌బాబు కోరారు. మరిన్ని వివరాలకు సెల్ : 9553528888, పిడి డి.నాగరాజు సెల్ : 9490798909లో సంప్రదించాలని కోరారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు: ఎంపిడిఒ

ప్రజాశక్తి-గన్నవరం(ఉంగుటూరు)

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని ఎంపీడీవో జిఎస్‌వి శేషగిరిరావు అన్నారు. ఉంగుటూరు మండలం లంకపల్లి అగ్రహారంలోని ఎంపియుపి పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేందుకు మొగ్గు చూపేలా జగనన్న ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక, వసతి దీవెన, విద్య దీవెన జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, స్వేచ్ఛ (శానిటరీ నాప్కిన్స్) దోహదపడుతున్నాయన్నారు. నాడు-నేడు ద్వారా అభివృద్ధి పనులతో పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. పిల్లలు ఆసక్తిగా చదువుకోవాలంటే వారికి ఆకలి బాధ తెలియ కూడదన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షబినా, ఉపాధ్యాయులు గాంధీ, చంద్రశేఖర్, అనిల్ కుమార్,సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న ఎంపిడిఒ శేషగిరిరావు

మువ్వల సవ్వడితో మురిసిన కూచిపూడి

ప్రజాశక్తి - మొవ్వ

శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో కొనసాగుతున్న సాంస్కృతిక కళోత్సవ్ కార్యక్రమాల్లో భాగంగా రెండోరోజైన శుక్రవారం పలువురు కళాకారులు ప్రదర్శించిన అంశాలు రంజింపజేశాయి. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య పసుమర్తి రామలింగ శాస్త్రి కొరియోగ్రఫీలో రూపొందిన 'గజాననీయం'



నృత్యంచేస్తున్న కళాకారిణులు

కూచిపూడి నృత్యరూపకం ఆద్యంతం ప్రేక్షకులను ఓలలాడించింది. పండిత పామరులకు సైతం విధితమైన కథాంశాన్ని కూచిపూడి బాణిలో మలచిన శాస్త్రిని పలువురు అభినందించారు. కూచిపూడి నృత్యరూపకాల రచయిత దండిభొట్ల వైకుంఠ నారాయణమూర్తి కలం నుంచి జాలువారిన ఈ నృత్యరూపకానికి సంగీతాన్ని దండిభొట్లశ్రీనివాస వెంకటశాస్త్రి సమకూర్చారు. దర్శకత్వ బాధ్యతలు డాక్టర్ పసుమర్తి రామలింగ శాస్త్రి నిర్వహించారు. ఈ నృత్యరూపకంలో సుబ్బరాజు (శివుడు), శ్వేత (పార్వతి), సౌజన్య (విష్ణుమూర్తి), యామిని రెడ్డి (లక్ష్మీదేవి), ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు(మాయా విష్ణువు), భరత్ (గజాసురుడు), రిషిత (వినాయకుడు), సురేంద్రనాథ్ (నారదుడు), మోహనరావు, సాగర్, విశ్వనాథ్, నట సాయి (రాక్షసులు), సుష్మ, సుస్మిత, దీపిక, ఐశ్వర్య (చెలులు) తమ పరిధి మేరకు నర్తించి ప్రేక్షకులను ఆనంద పరవశులను చేశారు. శ్రీ భారతి కళాసదన్ (విశాఖపట్నం) వ్యవస్థాపకురాలు భారతి కుమార్తె మహీధర శ్రీ రవళి మనోహర్‌తో 'ఎందరో మహానుభావులు' కామాక్షి స్తుతి, జాహ్నవి (నందిగామ)చే బ్రహ్మాంజలి కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. శ్రీ రాధేశ్యామ్ కూచిపూడి కళాక్షేత్రం నృత్య వాగ్గేయకార దండిభొట్ల వైకుంఠ నారాయణమూర్తి (హైదరాబాద్) శిష్యులు అలేఖ్య, వర్షిత, రాఘవైష్ణవి, లాస్య మణికర్ణిక, అఖిల సహస్ర, సమన్వి, శివాని, సాయి రోహిత భాస్కరునిలు దశావతారాలు, సరస్వతీ స్తుతి, నారాయణీయంలతోపాటు ఉషా పరిణయంలోని ఉషా ప్రవేశ దరువును ప్రదర్శించారు. కుప్పాపద్మజ (వరంగల్) శిష్యులు తరిగొప్పల శ్రీధర్, ఎస్.జీవిత భావయామి రఘురామం, జయదేవుని అష్టపది, భో శంభో అంశాలను ప్రదర్శించారు. తొలిత బుర్ర పద్మనాభ శర్మ భాగవతార్ సుందరాకాండ హరికథాగానం, సోమయాజు శ్రీరామచంద్ర శర్మ (గీతా శర్మ) చే భక్తి రంజని కార్యక్రమం శ్రవణానందకరంగా జరిగింది. ఈ కార్యక్రమాలను దేవాలయ పాలకమండలి కార్యవర్గ సభ్యులు, నాట్యలెజెండ్ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం నిర్వహణలో సాగాయి. కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళా రత్న డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, బిస్మిల్లా ఖాన్ యువపురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చింతా రవి బాలకృష్ణలతోపాటు ఆలయ పాలక మండలి సభ్యులు తదితరులు సహకరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కడవకొల్లు

పెట్టుబడులపై చరిత్ర సృష్టిస్తున్న సిఎం జగన్ : కడవకొల్లు

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్రానికి పెట్టుబడులు రావంటూ హేళన చేస్తున్న ప్రతిపక్షాలకు చెంప చెల్లుమనిపించేలా ఒకే రోజు రూ.13 లక్షల కోట్ల ఎంఒయులు చేసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి చరిత్ర సృష్టించారని వైసిపి జిల్లా కార్యదర్శి కడవకొల్లు నరసింహారావు తెలిపారు. శనివారం వైసిపి కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ శుక్రవారం విశాఖపట్నంలో అంగరంగ వైభవంగా ప్రారంభించారన్నారు. ఇందులో రెండు లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ముఖ్యమంత్రి ఆశించారన్నారు. కానీ ఊహించని విధంగా మొదటి రోజే రూ.13 లక్షల కోట్ల ఎంఓయులు చేసుకోవడం ఆశ్చర్యం గొలిపిందన్నారు. దీనితో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రాష్ట్రంగా అవతరించడంతోపాటు ఆరు లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చే అవకాశం లభిస్తోందన్నారు. మరోపక్క అవనిగడ్డ నియోజకవర్గంలో కాంట్రాక్టు కోసం షాడో ఎమ్మెల్యే కోసం రాజకీయాలంటూ ప్రతిపక్ష నాయకులు తనపై అవాకులు చవాకులు పేలుతుండటం సరికాదన్నారు. తాము నియోజకవర్గ అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చామన్నారు. అంతే తప్ప సంపాదించుకోవడానికి రాలేదన్నారు. కేవలం రెండు లక్షలతో సాల్వేషన్ సర్టిఫికెట్ తీసుకొని రూ.20 లక్షల కాంట్రాక్టు కోసం ప్రయత్నం చేస్తున్న వ్యక్తిని నివారించడం తప్పుగా భావిస్తున్నారన్నారు. గతంలో అవనిగడ్డ అశ్వరావు పాలెం మీదగా మండపాకలకు కాలువ నిర్మాణాన్ని ఆనాటి ఎంపీ బాలశౌరి సహకారంతో చేపడితే దానిని మధ్యలో ఆపించింది గత ప్రజా ప్రతినిధి కాదా? అని ప్రశ్నించారు. దివిసీమలో అవుట్ పాల్ స్లూయిజ్‌ల నిర్మాణం డెల్టా ఆధునీకరణ పనుల్లో భాగంగా చేపట్టాల్సివుండగా వాటిని చేపట్టకపోవడంతో రైతుల పంట పొలాలు తీవ్ర ముంపుకు గురై కష్టాలు పడుతున్నారన్నారు. తిరిగి వాటి నిర్మాణానికి తాము రూ.30 కోట్లతో ప్రతిపాదనలు పంపాల్సివచ్చిందన్నారు. మందపాకల, జరుగువానిపాలెం పైపులైన్ల నిర్మాణానికి సంబంధించి కూడా అనవసరమైన రాద్ధాంతాలు చేయడం సరైంది కాదన్నారు. గతంలో లంకమ్మ మాన్యంలో రహదారుల నిర్మాణం చేపడితే అడ్డుకున్నారన్నారు. పేదవారి ఇంటి కోసం బుసుక, ఇసుక తవ్వనీయకుండా అడ్డుకుంటున్నారన్నారు. సామాన్యులు, పేదలు ఇల్లు కట్టుకోవడానికి అవకాశం లేకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. మోపిదేవి మండలంలోని నాగాయితిప్ప పాఠశాలలో విద్యార్థులు క్రీడా ప్రాంగణం కోసం బుసుకతో మేరక పనులు చేస్తుంటే అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, పట్టణ పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష పాల్గొన్నారు.



పాలకమండలి సభ్యులను అభినందిస్తున్న కొడాలి నాని

కొండాలమ్మ పాలక మండలికి ఘన సత్కారం

జెసి, గుడివాడ ఎంఎల్ఎ అభినందనలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

గుడ్లవలేలరు మండలంలోని వేమవరంలోని శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం నూతన పాలకవర్గ మండలి సభ్యులకు అభినందన సభను నిర్వహించినట్లు ఆలయ కార్యాలయ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని), కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ పాల్గొని పాలక మండలి సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈవో సురేష్ బాబులు వారిని ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ జి.హరి హరిగోపీనాథబాబు, వైస్ ఎంపీపీ సాయన రవి, గ్రామ సర్పంచ్ మన్యం పద్మావతి, ఎంపీటీసీ పరసా సువర్ణ, పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయొద్దని నిరసన

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ గ్రామంలో 9వ వార్డు సమీపంలో నాగాయలంక ప్రధాన రహదారి ప్రక్కనున్న డంపింగ్ యార్డును అశ్వరావు గ్రామం సమీపంలోకి మారుస్తున్నట్లు ఊహాగానాలు రావటంతో ఆ గ్రామస్తులంతా నిరసనకు దిగారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామస్తులంతా గ్రామ సమీపంలోని అవనిగడ్డ గుడుమోటు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ



ధర్నాలో పాల్గొన్న గ్రామస్తులు

ఆస్తుల విలువ పెంచుకునేందుకు, మీ స్థలాల్లో కళ్యాణ మండపాలు కట్టుకునేందుకు తమ గ్రామాన్ని బలిచేస్తారా? అంటూ ప్రజా ప్రతినిధులను ప్రశ్నించారు. అవనిగడ్డ చెత్త అశ్వరావు పాలెం వద్దంటూ నినాదాలు చేశారు. పక్కనున్న మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు స్థలాలకు ధరలు పెంచుకోవడం కోసం తమ గ్రామస్తుల ప్రాణాలను ఫణంగా పెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు దాసినేని శ్రీనివాసరావు, అవనిగడ్డ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రేపల్లె వీరరాఘవయ్య, రైతులు పంద్రాజు రేణుకయ్య, గ్రామ మాజీ సర్పంచ్ కొండవీటి మధు, పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లిటిల్ ఛార్మ్స్‌లో సందడిగా హోలీ

గన్నవరం : ప్రజల జీవితాల్లో రంగులు నింపేదే హోలీ అని కరస్పాండెంట్ రోజా ప్రత్యూష అన్నారు. స్థానిక లిటిల్ ఛార్మ్స్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా హోలీ పండుగను నిర్వహించారు. చిన్నారులు ఒకరికొకరు రంగులు పూసుకుని సందడి చేశారు. హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు దుర్గ, మనీషా, షజియా, శ్రీ కన్య, దుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.





అర్జునుడుకు అంతిమ వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

పక్కనే అర్జునుడి దహన సంస్కారాలను కుటుంబ సభ్యులు పూర్తి చేశారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. విజయవాడ ఎంపి కేశినేని నాని, మాజీ మంత్రులు దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, మాజీ ఎంపి కొనకళ్ళ నారాయణరావు, టిడిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మాజీ ఎంఎల్‌ఎలు బోడె ప్రసాద్, రావి వెంకటేశ్వరరావు, తంగిరాల సౌమ్య, బూరగడ్డ వేదవ్యాస్, మాజీ ఎంఎల్‌సిలు వైవిబి.రాజేంద్ర ప్రసాద్, బుద్ధా వెంకన్న, నాగుల్ మీరా తదితరులు అర్జునుడు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ పేర్ని నాని, సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, నగర కార్యదర్శి బూర సుబ్రమణ్యం, నాయకులు సిహెచ్.జయరావు, కొడాలి శర్మ, ఎస్.ధనుంజయరావు, జనసేన నాయకులు బండి రామకృష్ణ తదితరులు అర్జునుడు భౌతికకాయానికి నివాళు లర్పించారు. సంతాప సూచకంగా మచిలీపట్నంలో ఉదయం వ్యాపార సంస్థలు మూసివేశారు.



మహిళలకు కోళ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

మహిళల ఆర్థిక స్వావలంభనే లక్ష్యం : డిల్లీరావ

ప్రజాశక్తి - విజయవాడ : స్వయం సహాయక సంఘాల మహిళలకు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద డిఆర్‌డిఏ జగనన్న చేదోడు పథకం ద్వారా నాటుకోళ్లను పంపిణీ చేశారు. ఈ సంధర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ చేదోడు పథకం ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయంతో జిల్లాలో వెయ్యి స్వయం సహాయక సంఘాల మహిళలకు నాటుకోళ్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఒక్కో యూనిట్‌కు పది కోళ్లను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. రూ.1200 ఖర్చుతో నెల రోజులకు సరిపడా కోళ్ల మేతను, రూ.852లతో కోళ్లకు వాక్సినేషన్ వేయించి మహిళ సంఘాలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రూ.44 లక్షల వ్యయంతో జిల్లాలో 1000 సంఘాల సభ్యులకు కోళ్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 2 వేల గొర్రె పొట్టేళ్లను పంపిణీ చేయాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎపియం జి.చంద్రశేఖర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు బి.అమ్మాయమ్మ, ఎం.రామారావు, ఎం.కాంతి శ్రీ, మండల సమైక్య అధ్యక్షురాలు పి.లియోనా పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, వణుకూరు

ఆర్.ఓ.సి. నెం. 01/2023 — తేది : 01-03-2023

టెండరు నోటీసు

కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, వణుకూరు గ్రామపంచాయతీ నందు ఈ దిగువ చూపిన షెడ్యూలు ద్వారా పనులు నిర్వహణ 2023-24 సం॥నకు కాంట్రాక్టు ఏజెన్సీ ద్వారా సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది.13-03-2023వ తేదీ సోమవారం ఉదయం 10 గం.ల నుండి మధ్యాహ్నం 12 గం.ల వరకు స్వీకరించబడును. అదేరోజు 3 గంటల వరకు హాజరైన టెండరుదార్లు సమక్షంలో తెరువబడును. సదరు టెండర్లు నందు పాల్గొనువారు నిర్ణీత ధరావత్తు చెల్లించి దాఖలు చేయవలెను. ఇతర షరతులు వివరములు పంచాయతీ కార్యాలయము పనివేళలలో తెలుసుకొనగలరు.

షెడ్యూలు

వ.నెం.	వివరములు	కావల్సిన సిబ్బంది	ధరావత్తు
1,	2023-24 సం॥నకు 1. ప్రజారోగ్య నిర్వహించు ఎ) పారిశుధ్య కార్మికులు-15 బి) ట్రాక్టర్ డ్రైవర్-1	16	5,000/-
2.	మంచినీటి సరఫరా ఎ) ఫిట్టర్-1 బి) ట్యాంక్ ఆపరేటర్లు-2	3	
3.	వీధి లైట్లు నిర్వహణ ఎ) ఎలక్ట్రీషియన్-1 బి) హెల్పర్ -1	2	
	మొత్తము	21	5,000/-

గమనిక : 1) నిధుల లభ్యతను బట్టి చెల్లింపులు జరుపబడును.
2) అనుభవము కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సం/- కె.లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి,
వణుకూరు గ్రామపంచాయతీ,
పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా.

గ్రామపంచాయతీ కార్యాలయం, తేలప్రోలు

ఉంగుటూరు మండలం, కృష్ణాజిల్లా

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. 24/2023 — తేది : 02-03-2023

కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, తేలప్రోలు గ్రామపంచాయతీ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా పనులు నిర్వహించుటకు సీల్డ్ టెండర్లు ది.09-03-2023 ఉదయం 11 గం.లకు ఏజెన్సీ / కాంట్రాక్టు నుండి కార్యదర్శి వారిచేగాని లేక వారి అనుమతి పొందిన వారిచేగానీ సీలు టెండర్లు స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం 1.00 గం.లకు అప్పటి వరకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షంలో సీల్ టెండర్లు తెరువబడును. టెండర్లలో పాల్గొనదలచిన వారు షెడ్యూలులో ధరావత్ చెల్లించి టెండర్లలో పాల్గొనవలెను. ధరావత్ చెల్లించని టెండర్లు స్వీకరించబడవు. ఇతర విషయములు పంచాయతీ కార్యాలయంలో పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	సంఖ్య	కాలము	ధరావత్తు
1.	శానిటేషన్ సిబ్బంది	14	01-04-2023 నుండి 31-03-2024 వరకు	20,000/-
2.	ట్యాంక్ ఆపరేటర్	5		
3.	ట్రాక్టర్ డ్రైవర్	1		
4.	నిచ్చెన మోయుటకు స్వీపరు	1		
5.	ఎలక్ట్రీషియన్	1		
6.	పైపులైన్ ఫిట్టర్	1		
1.	గ్రామపంచాయతీకి కావాల్సిన ఈ క్రింది తెలిపిన సామాగ్రి 1) మంచినీటి సరఫరా సామాగ్రి 2) స్టేషనరీ 3) వీధి దీపములు విడి భాగములు 4) ప్రజారోగ్యం			3,000/-

నోట్ :
1. పంచాయతీ వారిచే తయారు చేయబడిన షెడ్యూల్ షరతులు వగైరా పంచాయతీ కార్యాలయంలో పొందగలరు.
2) గ్రామపంచాయతీ నిధుల నిల్వలను బట్టి నెలకు ఒక పర్యాయం సొమ్ము చెల్లించబడును.
3) కార్మికులకు విధిగా ప్రతినెలా పేమెంట్ చేయవలెను.
4) వేజిబోర్డు నిర్ణయించిన వేతనము చెల్లించు పద్ధతిపై టెండరు దాఖలు చేయవలెను మరియు పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ. సౌకర్యంలు వర్తింపు చేయవలెను.
5) వేజ్‌బోర్డు నిర్ణయించిన వేతనము చెల్లించు పద్ధతిపై టెండరు దాఖలా చేయవలెను. అట్లు దాఖలు చేయని టెండర్లు తిరస్కరించబడును.
6) కార్మికులకు బట్టలు, చెప్పులు, సబ్బులు, కొబ్బరినూనె ఏజెన్సీ / కాంట్రాక్ట్ వారు ఇవ్వవలెను.
7) ట్రాక్టర్ డ్రైవర్లు టెండరు దారులు హెవీ లైసెన్స్ కలవారై యుండి జిరాక్స్ కాపీ జతపరచవలెను.
8) గ్రామపంచాయతీ సూచించిన ప్రదేశంలో మాత్రమే చెత్త డంపింగ్ చేయవలెను.
9) విధుల నిర్వహణలో ఏ విధమైన ఆలస్యం జరిగిన యెడల ఏ విధమైన నోటీసు ఇవ్వకుండా టెండరు రద్దు పరచవలెను.
10) పారిశుధ్య పనుల నిర్వహణలో 70% పురుషులు, 30% మహిళలు వుండవలెను.
11) గతంలో పనిచేసిన వర్కర్లకి ప్రాధాన్యత ఇవ్వబడును.

సం/- వర్రే కృపాకుమార్,
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, తేలప్రోలు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మధిర బ్రాంచ్ వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **బాలసాని ఉపేంద్ర,** తండ్రి : **శ్రీనివాసరావు, వయస్సు : 25 సం॥లు, నివాసం :** ఇ.నెం. 11-103, చెరువుకట్ట బజారు, పెనుగంచిప్రోలు గ్రామము, పెనుగంచిప్రోలు మండలం, యన్.టి.ఆర్. జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి :

యన్.టి.ఆర్. జిల్లా, జగ్గయ్యపేట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, పెనుగంచిప్రోలు మండలం, పెనుగంచి ప్రోలు గ్రామ పంచాయితీ ఇ.నెం. 17-110/1 ఏరియాలోని, పెనుగంచిప్రోలు గ్రామము తాలూకు ఆర్.యస్.నెం. 218/6బిలో మాకు హక్కు గల య.0-03 శెంట్లు (లేక) 145.2 చ॥గ॥లు, **డాక్యూమెంట్ నెం : 593/2023** గల ఆస్తినకు హద్దులు : **తూర్పు :** భూక్యా నాగులు గారి ఆస్థి, **దక్షిణం :** మట్టి రోడ్డు, **పడమర :** సి.సి.రోడ్డు, **ఉత్తరం :** పల్లపు దుర్గ గారి ఆస్థి

దండా సుధాకర్ రావు, అడ్వకేట్, ఖమ్మం.
సెల్ : 9399311809

మహారాజశ్రీ 15వ అదనపు జిల్లా జడ్జి మరియు మోటారు వెహికల్ క్లైమ్స్ ట్రిబ్యునల్ వారి కోర్టు-కృష్ణా, నూజివీడు

యమ్.వి.ఓ.పి.నెం. 22/2020

బిట్వీన్:

పెద్దినేని ద్రౌపది అనే ద్రౌపతి ...**పిటీషనరు**

మరియు

కమలా యాకోబు మరియు 2 ఇతరులు ...**రెస్పాండెంట్లు**

టు: 1వ రెస్పాండెంటు:

శ్రీ కమలా యాకోబు, తండ్రి: వెంకటేశ్వర్లు, హిందూ, నివాసం: డో.నెం.6-172, యస్.సి.కాలనీ, అల్లూరు గ్రామం, వీరులపాడు మండలం.

పై నెంబరు యమ్.వి.ఓ.పి.లో 1వ రెస్పాండెంటు అయి మీరు పైన పేర్కొన్న మీరు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గానూ వాయిదా **ది.15-03-2023వ తేదీన ఉన్నది. సదరు తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

దేవినేని సూర్యనాథ్
నూజివీడు, పిటీషనరు తరపు న్యాయవాది
20-02-23. సెల్: 94403 75789

గ్రామ పంచాయితి కార్యాలయం, బూదవాడ

జగ్గయ్యపేట మండలం, ఎన్‌టిఆర్ జిల్లా.

ఆర్‌ఓసి నెం. 145/2023. — **టెండర్ ప్రకటన** — తేది : 03-03-2023

ఎన్‌టిఆర్‌జిల్లా, జగ్గయ్యపేట మండలం, బూదవాడ గ్రామ పంచాయితి నందు ది.01-04-2023 నుండి 31-03-2024 వరకు ఒక సంవత్సర కాలం కాంట్రాక్టు పద్ధతిపై ఈ దిగువ తెలిపిన పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండరు ది. 13-03-2023 తేదీ మధ్యాహ్నం 12 గం.ల వరకు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 3 గం.లకు హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరువబడును. టెండరు షరతులు, ఇతర విషయములు కార్యాలయ పనివేళల యందు తెలుసుకొనవచ్చును.

వరుస క్రమం	పనివివరాలు	కాలపరిమితి	ధరావత్తు
1.	మంచినీటి నిర్వహణ-ఒక్కరు	01-04-2023 నుండి 31-03-2024	5,000/-
2.	పారిశుధ్య పనులు-18 వ్యక్తులు	01-04-2023 నుండి 31-03-2024	
3.	వీధి దీపములు నిర్వహణ-ఒక్కరు	01-04-2023 నుండి 31-03-2024	

గమనిక : గతంలో అనుభవం వున్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. పంచాయితి నిధులు నిల్వలను బట్టి పేమెంట్ చెల్లించబడును. టెండర్లను స్వీకరించుటకు లేదా తిరస్కరించుటకు పంచాయితి వారికి పూర్తి అధికారం కలదు.

గుగులోతు లక్ష్మీ బాలాజీ
సర్పంచ్
గ్రామ పంచాయితి బూదవాడ
జగ్గయ్యపేట మండలం, కృష్ణాజిల్లా

సం/- బి.శివాజీ
పంచాయితి కార్యదర్శి,
గ్రామ పంచాయితి బూదవాడ
జగ్గయ్యపేట మండలం, కృష్ణాజిల్లా

గ్రామ పంచాయితీ కార్యాలయము - కంచికచర్ల

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం.5/2023 — **తేది.28.02.2023.**

ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం, కంచికచర్ల గ్రామ పంచాయితీనకు సంబంధించిన ఈ దిగువ ఉదహరించిన పనులు నిర్వహించుటకు కాంట్రాక్టు ఏజన్సీ పద్దతి ద్వారా వ్యక్తులు సప్లయి చేయుటకు మరియు ఇతర పనులకు ది.10.03.2023వ తేది ఉదయం గం.10.00 నుండి మధ్యాహ్నం గం.1.00ల వరకు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు షెడ్యూల్డు దాఖలా ధరావత్తు చెల్లించి నిర్ణీత నమూనా నందు స్వీకరించబడును. అదే రోజు సాయంత్రం గం.3.00 ని॥లకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షమున టెండర్లు తెరువబడును. టెండరు స్వీకరించుట లేక తిరస్కరించుటకు ఏవిధమైన కారణం చూపక వాయిదా వేయు అధికారము పంచాయితీ కార్యదర్శివారికి కలదు. వివరములకు కార్యాలయ పనిచేయు వేళలయందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	ఐటమ్ వివరము	కాలము	చెల్లించవలసిన ధరావత్తు
1	2	3	4
1.	గ్రామ పంచాయితీ ఏరియాలో పారిశుధ్య నిర్వహణ పనులు నిర్వహించుటకు 60 వ్యక్తులు ఒక సంవత్సర కాలము సప్లయి చేయుటకు	ది.1.4.2023 నుండి ది.31.3.2024 వరకు	రూ.5,000/-
2.	గ్రామ పంచాయితీ ఏరియాలో మంచినీటి సరఫరా నిర్వహణ పనులు నిర్వహించుటకు 5 వ్యక్తులు ఒక సంవత్సర కాలము సప్లయి చేయుటకు (నిర్వహణ గ్యాపులు వేయుటకు గుంటలు తవ్వుట మరియు పూడ్చుకొనుట వారే నిర్వహించుకొనవలెను.)	ది.1.4.2023 నుండి ది.31.3.2024 వరకు	రూ.5,000/-
3.	గ్రామ పంచాయితీ ఏరియాలో వీధి దీపముల రిపేరు పనుల నిర్వహణకు ఐటి.ఐ సర్టిఫికేట్ కలిగిన ఒక ఎలక్ట్రీషియన్ ఇరువురు హెల్పర్లు సప్లయి చేయుట.	ది.1.4.2023 నుండి ది.31.3.2024 వరకు	రూ.5,000/-
4.	గ్రామ పంచాయితీ ఏరియాలోని చెత్త ట్రాక్టర్లకు ఐదుగురు (5) డ్రైవర్లను సప్లయి చేయుట (రవాణా శాఖ వారి లైట్ మోటారు వెహికిల్ లైసెన్సు కలిగియుండవలెను.)	ది.1.4.2023 నుండి ది.31.3.2024 వరకు	రూ.1,000/-

గమనిక :- 1) 1 నుండి 3 వరకు గతములో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2) గ్రామ పంచాయితీ ఆర్థిక నిల్వను బట్టి చెల్లింపులు చెల్లించబడును.
3) ఏజన్సీకి ఎటువంటి అడ్వాన్సులు ఇవ్వబడవు.

(సం) శ్రీమతి వేల్పుల సునీత
సర్పంచ్
గ్రామ పంచాయితీ, కంచికచర్ల.

(సం) కె రవికుమార్
పంచాయితీ కార్యదర్శి
గ్రామ పంచాయితీ, కంచికచర్ల.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, AT: VISAKHAPATNAM

I.A.183/2021 in O.S.372/2006

Between:
1) Kodali Venkatanarayana (died)
2) Sri Budda Mahalakshmi Naidu
...Petitioners/Defendants

And:
Mulkanta Rama Devi & others
...Respondents/Plaintiffs

NOTICE

To,
R-2: Kolli Vani, W/o. Yekantha Rao, Hindu, 60 yrs, R/at Plot No.100, S.V.K.P. Clony, Vijayawada, Krishna District.
R-3: Kosaraju Lakshmi Tulasi, W/o. K.Vijayababu, Hindu, 52 yrs, R/at D.No. 59-13-2/2, Dipo Basthi, Gayathrinagar, Vijayawada, Krishna District.
R-4: Gullapalli Appa Rao, S/o. G. Ramabrahamam, Hindu, 58 yrs, R/at Opp. N.T.R. Medical University, Vijayawada, Krishna District.

Please take notice that the above named petitioners has instituted the above petition against you and the matter stands posted to **12-04-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **12-04-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

V.D.V.N. MURTHY,
Advocate, Visakhapatnam.
Cell: 9848404247.

గ్యాస్ ధరలపై సిపిఎం, ఐద్వా నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ సిపిఎం, ఐద్వా ఆధ్వర్యంలో మచిలీపట్నం, బంటుమిల్లి, గన్నవరం, చల్లపల్లిలో ఎపి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. **కలెక్టరేట్ (కృష్ణా) :** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక 35,36,37 డివిజన్లలో కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహా రావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిదేళ్లలో గ్యాస్ ధరలు రూ.450 నుంచి రూ.1125కు పెంచిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో గ్యాస్,పెట్రోల్ రేట్లు తగ్గుతుండగా భారత దేశంలో మాత్రం పెంచడం సిగ్గుచేటన్నారు. పేద ప్రజలపై ధరల భారాన్ని మోపి ప్రజల జేబులు కొడుతూ, ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్ల ఖజానా నింపుతోందన్నారు. సిపిఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, సిహెచ్ రాజేష్ ,జిల్లా సీనియర్ నాయకులు కొడాలి శర్మ, సిహెచ్ జయరావు, కే సుజాత,బి భవాని తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం :** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించే వరకూ పోరాటం చేయాలని ఐద్వా జిల్లా నాయకురాలు మల్లంపల్లి జయమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం గన్నవరం మండలం బుద్ధవరం శివారు రాజీవ్ కాలనీలో గ్యాస్ ధరల పెంపుకు నిరసనగా ఐద్వా గన్నవరం కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి గ్యాస్ ధరలు పెంచుతూనే ఉందన్నారు. రూ.500 ఉండాల్సిన గ్యాస్ బండ రూ.1250కి చేరిందంటే దీని వెనుక కార్పొరేట్ శక్తుల కుట్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికంగా ఉన్న మహిళలు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** స్థానిక అంబేద్కర్ సెంటర్లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం బంటుమిల్లి మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎల్.అజయ్‌ఘోష్, మాజేటి పద్మ, పొదిలి వెంకన్న, బొడ్డు నాగరాజు, వంగల రాజు, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎపి మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా ఎపి మహిళా సమైక్య ఆధ్వర్యంలో మండల పరిధిలోని వక్కలగడ్డలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. హనుమానుల రాణి కుమారి, అట్లూరి స్వరూప, వెలివేల మాధవి, అనిత, విభాస్కరమ్మ, సిహెచ్ రత్నకుమారి, రాజ్యలక్ష్మి,రాముడు, వనజ, శిరీష, గాయత్రి పద్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో



బంటుమిల్లిలో



గన్నవరంలో



చల్లపల్లిలో

బచ్చుల అర్జునుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

శాసనమండలి సభ్యులు, టిడిపి సీనియర్ నేత బచ్చుల అర్జునుడు మృతికి పలువురు టిడిపి నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు. పలుచోట్ల ఆయన చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. చల్లపల్లి: అర్జునుడు మతికి చల్లపల్లి మండల టీడీపీ నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ పార్కులో అర్జునుడు చిత్రపటానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, తెలుగుమహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, నిడమానూరి దిలీప్ కుమార్, మోర్ల ప్రసాద్, గోవాడ చంటి, పరిసె మౌళి, గొరిపర్తి సుబ్బారావు, మట్టా అశోక్ కుమార్, అనగాని నాగేశ్వరరావు, లక్ష్మణ్, రవి, ఎంపీటీసీలు పైడిపాముల స్వప్న, షేక్ నభీ ఘోరి, వార్డు సభ్యులు అంబటి భువనేశ్వరరావు, షేక్ సిలార్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : బచ్చుల అర్జునుడు మృతి టిడిపికి లోటుని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు కాకరాల సురేష్, యలమంచిలి సతీష్, కంచర్ల సుధాకార్, తదితరులు పాల్గొన్నారు. వెనిగండ్ల ఫౌండేషన్ అధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. తులసి బాబు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చల్లగుళ్ళ సుబ్రహ్మణ్యేశ్వరరావు, శంకరపాడు, తుమ్మలపల్లి సర్పంచ్‌లు కైలే సుబ్బారావు, రాధాకష్ణ, నాయకులు తులసి రాణి, బొంబాయి శ్రీను, కంచనపల్లి సుబ్రహ్మణ్యం, అడుసుమిల్లి, లక్ష్మణరావు, ఐనంపూడి సురేష్ పాల్గొన్నారు. **మొవ్వ :** కూచిపూడిలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగిన సంతాప సభలో మొవ్వ మండల టిడిపి అధ్యక్షుడు రామలింగేశ్వరావు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర, కృష్ణాజిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షులు పెదపూడి ఆనంద్, తాతినేని చిన్నపూర్ణ వీరంకి తులసిదాస్, బోగాది నాగేశ్వరరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు, తాతా నాని, శీలం బాబూరావు, మురారి పూర్ణా, సంగిశెట్టి నాగభూషణం ,రంగరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** అర్జునుడు అకాల మరణానికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబి రాజేంద్రప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు జంపాన గుర్నాథరావు, ఉయ్యూరు మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, జ యదేవ్, చిరంజీవి, భాస్కర్, రఫీ, అప్పలనాయుడు తదితరులు నివాళులర్పించారు. **కోడూరు :** కోడూరు ప్రధాన సెంటర్ వద్ద ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ కోడూరు మండలం అధ్యక్షులు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు నివాళు లర్పించారు. తెలుగుదేశం పార్టీ నేతలు కాగిత రామారావు, బొలిశెట్టి విటల్ రావు, జరుగు వెంకటేశ్వరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** స్థానిక టిడిపి కార్యాలయంలో అర్జునుడు చిత్రపటానికి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, కర్ర సుధాకర్ బండే రాఘవ, తలసిల స్వర్ణలత, బర్మా శ్రీనివాసరావు, మాచవరపు ఆదినారాయణ, కోట సాయి, గుడివాక నరహరి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. **మచిలీపట్నం అర్బన్ :** అర్జునుడు అకాల మరణానికి పట్ల కష్ణాజిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథ రావు(బుల్లయ్య) ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఎమ్మెల్యే వంశీ సంతాపం

గన్నవరం : శాసనమండలి సభ్యులు బచ్చుల అర్జునుడు మతికి గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు. అర్జునుడు రాజకీయ శైలి, వాగ్ధాటి ఎన్నటికీ మరువలేనివిగా పేర్కొన్నారు. మృదు స్వభావిగా, వివాదరహితునిగా రాజకీయాల్లో ఆయన ఎందరికో ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు.



గుడివాడలో



కోడూరులో



మొవ్వలో



అవనిగడ్డలో

కోర్టు ఆదేశాలతో పాత వారికే వంట ఏజెన్సీ అప్పగింత

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

మండలంలోని పెనమకూరు దక్షిణ దళితవాడ ప్రాథమిక పాఠశాలలో వంట ఏజెన్సీ నిర్వాహకురాలు శ్రీకాకుళపు సరళను అధికారులు ఎలాంటి కారణాలు చూపకుండా తప్పించి వేరే వారిని నియమించి వంట ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. దీనిపై బాధితురాలు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు స్పందన కార్యక్రమంలో కూడా ఫిర్యాదు చేశారు. సిపిఎం, సిఐటియుల ఆధ్వర్యంలో అనేక ధర్నా కార్యక్రమాలు కూడా జరిగాయి. మండల స్థాయి అధికారులకు ఆమె తన గోడు వినిపించుకున్నప్పటికీ ఎవ్వరూ స్పందించలేదు. 16 సంవత్సరాల నుంచి వంట ఏజెన్సీ నిర్వహిస్తూ జీవిస్తున్నామని తమకు ఏ విధమైన నోటీసులు ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా ఏజెన్సీ నుంచి తొలగించారని ఆవేదన చెందారు. సిపిఎం మండల నాయకులు శీలం ప్రకాశరావు సహాయంతో అనేక కార్యక్రమాలు నిర్వహించి కోర్టును ఆమె ఆశ్రయించారు. కోర్టు తీర్పు బాధితురాలికి అనుకూలంగా వచ్చింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉపాధ్యాయులు శుక్రవారంనాడు శ్రీకాకుళపు సరళను పాఠశాలకు పిలిపించారు. వంట ఏజెన్సీ పునరుద్ధరించి వంట చేయాల్సిందిగా కోరారని సరళ తెలిపారు. ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూ డిసెంబర్ 9న తనను వంట ఏజెన్సీ నుంచి తప్పించారన్నారు. మూడు నెలల అనంతరం కోర్టు ఆదేశాలతో తనను వంట ఏజెన్సీ లోకి తీసుకోవడం పట్ల సరళ పాత్రికేయుల సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు. . వంట ఏజెన్సీ నిర్వహిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో శీలం ప్రకాశరావు కూడా పాల్గొన్నారు.

బాలయోగికి ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ

మాజీ లోక్‌సభ స్పీకర్ కీర్తిశేషులు గంటి మోహనచంద్ర బాలయోగి 21వ వర్ధంతి సభ అవనిగడ్డ గాంధీ క్షేత్రంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగింది. బాలయోగి చిత్రపటానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్ర సుధాకర్, బండి రాఘవ, బర్మా శ్రీనివాసరావు, లింగం బాబూరావు, యలవర్తి చిన్న, చెన్ను బాబూరావు, పరిమిశెట్టి బాబు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు

గన్నవరంలో చెత్త సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం-ఆగిరిపల్లి రోడ్డుకు ఇరువైపులా చెత్త పడేయటంతో ప్రజలు నిత్యం పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం దొరికింది. జిందాల్ సంస్థ చెత్తను తీసుకెళ్లేందుకు ముందుకు రావడంతో శుక్రవారం చెత్త తరలింపు కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య పరిశీలన చేశారు. పంచాయతీ సర్పంచ్, పాలక వర్గం స్పందించి పంచాయతీ రాజ్ కమిషనర్ కోరగా చెత్తను తరలించేందుకు గ్రీన్ సిగ్నల్ రావటంతో పంచాయతీ పారిశుధ్య కార్మికులు జిందాల్ సంస్థకు చెత్త తరలింపు చేశారు. ఆగిరిపల్లి రోడ్డులో రెండు వైపులా భారీ ఎత్తున పోగుపడిన చెత్తను క్రమక్రమంగా బయటకు తరలిస్తారు. చెత్త నుంచి వచ్చే కంపు, కాల్చడం వల్ల వచ్చే పగ సమస్యతో మెట్ట గ్రామాలకు చెందిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు ఈ సమస్యకు పరిష్కారం లభించిందని ప్రయాణికులు, గన్నవరం ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే చెత్త డంపింగ్‌కు యార్డ్‌కు స్థలం సేకరించాల్సిన అవసరం అత్యవసరంగా ఉందని గ్రామ పెద్దలు అంటున్నారు. గన్నవరం ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

శిలువ మార్గ యాత్ర

గుడివాడ : క్రీస్తు శిలువ మార్గ యాత్రలు నందివాడ మండలంలోని నూతులపాడులోని (ఆర్‌సిఎం) చర్చి ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఆర్‌సిఎం విచారణ గురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్, సహాయగురువు ఫాదర్ రవికాంత్‌లు ప్రత్యేక ప్రార్థనలతో యాత్రను ప్రారంభించారు. ఉపదేశకులు సబాస్టియన్, భాస్కర్, ఆంతోని, క్రీస్తురాజు, కిరణ్, సంఘ పెద్దలు, మరియదళ సభ్యులు, సిస్టర్లు పాల్గొన్నారు.



సిపిఐ సీనియర్ నాయకులు బాలయ్య మృతి

ప్రజాశక్తి-భవానీపురం: సిపిఐ 43వ డివిజన్ సీనియర్ నాయకులు సిహెచ్.బాలయ్య (76) ఊర్మిళానగర్‌లోని తన



ఇంటి వద్ద శుక్రవారం మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వత్తిరిత్యా ఆర్టీసీ ఉద్యోగి అయిన బాలయ్య ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులుగా కార్మిక వర్గానికి సేవలందించారు. బాలయ్య మృతదేహాన్ని సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ కార్యదర్శి దోనేపూడి శంకర్, స్థానిక కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, సిపిఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శి వర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, కార్యవర్గ సభ్యులు తూనం వీరయ్య, ఎఐటియుసి నగర అధ్యక్షులు కెఆర్.ఆంజనేయులు, డివిజన్ కార్యదర్శి ఉప్పలపాటి శివప్రసాద్ రాజు, టి.పూర్ణయ్య సందర్శించి నివాళు లర్పించారు.

కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-నందిగామ: పట్టణ పరిధిలోని ఆరో వార్డులో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్.జయరాం శుక్రవారం పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులలో భాగంగా కాలువల్లో దోమల మందు పిచికారీని పరిశీలించారు. వార్డులో ప్రధాన డ్రెయిన్లుతో పాటు కల్వర్ట్‌లను పరిశీలించారు. వార్డులోని ప్రజలకు హెల్త్ సెక్రెటరీలు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి తెలిపారు. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో యాంటీ లార్వా ఆపరేషన్ పనులను నిర్వహించి దోమలను లార్వా దశలోనే నిర్మూలించే విధముగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వసతి గృహానికి నిరాశ్రయులు

ప్రజాశక్తి-విజయవాడ: సర్కిల్-1 పరిధిలోని చిట్టినగర్ సొరంగం రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లపై సేద తీరుచున్న ఇల్లు



లేని నిరాశ్రయులను విఎంసికి చెందిన సితార సెంటర్‌లోని వసతి గృహానికి 24 మందిని శుక్రవారం రాత్రి తరలించారు. సిడిఒ-1 దుర్గారావు నేతృత్వంలో భవానీపురం పోలీసులు, యుసిడి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని వసతి గృహానికి నిరాశ్రయులను తరలించారు. నైట్ డ్రైవ్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు దుర్గారావు తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రమాదాలు జరగకుండా నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలనే ఉద్దేశ్యంతో ఫుట్‌పాత్‌లపై సేదతీరుచున్న వారందరినీ ఆయా కేంద్రాలకు తరలించడం జరుగుతుందని దుర్గారావు అన్నారు.

యునో ఇంజన్ ఆయిల్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ద్విచక్ర వాహనాల కోసం బీఎస్ 6 ప్రమాణాలు కలిగిన ఆటోమోటివ్ ఇంజన్ ఆయిల్స్‌ను విడుదల చేసినట్లు యునో మిండా టూ వీలర్ హెడ్ రాజీవ్ జునేజా ఒక ప్రకటనలో తెలిపారు. మినరల్, సెమీ సింథటిక్, ఫుల్లీ సింథటిక్‌లో ఈ ఆయిల్స్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. వంద శాతం పర్యావరణ హితంగా లెడ్ రహిత కంటెయినర్లలో ప్యాక్ చేయబడ్డాయని తెలిపారు.

హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ గ్యారెంటీ ప్లాన్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ గ్యారెంటీ ఇన్‌కం ఇన్సూరెన్స్ ప్లాన్‌ను తీసుకువచ్చినట్లు సంస్థ హెడ్ అనీష్ ఖన్నా ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక అవసరాలను తీర్చేందుకు హెచ్‌డిఎఫ్‌సి గ్యారంటీ ఇన్‌కం ప్లాన్ ఎంతో ఉపయోగడపతుందున్నారు. పాలసీదారులకు ఆర్థిక భద్రత విషయంలో భరోసా కల్పించడే ప్రదాన ధ్యేయం అన్నారు. ఇన్కమ్ ఇన్సూరెన్స్ ప్లాన్ ఖచ్చితమైన రాబడులను అందించంతో పాటు భవిష్యత్తులో వచ్చే అన్ని పరిస్థితులకు పాలసీదారులకు భద్రత కల్పిస్తుందన్నారు. ఈప్లాన్ ఆదాయ చెల్లింపు దశలో సైతం ప్రీమియం చెల్లింపు కాల వ్యవధిని అలాగే లైఫ్ కవర్ ఎంపిక అందిస్తుందన్నారు.

సైన్స్ ఎక్స్‌పోకు విశేష స్పందన

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: సేఫ్, ఆంధ్రా లయోలా కళాశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో-2023కి విశేష




స్పందన లభిస్తోంది. రెండో రోజు శుక్రవారం నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల నుండి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శన ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. మూడు రోజుల పాటు జరుగనున్న సైన్స్ ఎక్స్‌పోలో 250కిపైగా ఎగ్జిబిట్స్‌ను ఏర్పాటు చేశారు. రెండో రోజు వివిధ విద్యా సంస్థలకు చెందిన అధ్యాపకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రదర్శనాంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సేఫ్ అధ్యక్షురాలు జి.జ్యోత్స్న మాట్లాడుతూ మొదటిసారిగా సేఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోకు మంచి ఆదరణ లభించిందని అన్నారు. ఆంధ్రా లయోలా కళాశాలతో పాటు నగరంలోని



పలు విద్యా సంస్థలు ఈ సైన్స్ ఎక్స్‌పోకు పూర్తి స్థాయిలో సహకారం అందించాయని తెలిపారు. సైన్స్ ఎక్స్‌పో ముగింపు కార్యక్రమం శనివారం సాయంత్రం లయోలా కళాశాల ఆడిటోరియంలో జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు, జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక పాల్గొంటారని తెలిపారు.

బచ్చుల అర్జునుడికి నివాళి

ప్రజాశక్తి-వన్‌టౌన్: టిడిపి క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మృతి తీరనిలోటని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. శుక్రవారం వన్‌టౌన్‌లోని బుద్దా వెంకన్న కార్యాలయంలో బచ్చుల అర్జునుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణపా రాము, సోమీ వెంకటేశ్వర్లు, చీపుళ్ల వెంకటేశ్వరరావు, ఈగల సాంబ, పట్నాల రమణ తదితరులు పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో జిఎంసి బాలయోగి, బచ్చుల అర్జునుడికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం పార్లమెంటు అధ్యక్షులు రాజు సోలంకి, కోగంటి రామారావు, రాజేష్, ఎర్ర రామారావు, నమ్మి భానుప్రకాష్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-విజయవాడ రూరల్:** నున్నలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రూరల్ మండల అధ్యక్షులు గంపా శ్రీనివాస్ యాదవ్, గుంటక సుబ్బారెడ్డి, కందుల లీలాకృష్ణ, శివారెడ్డి, తిరుపతిరావు, కొండేటి శ్రీనివాసరావు, బొమ్మారెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, ఎలమంచిలి రాఘవ, మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, పేరం సైదేశ్వరరావు, సంగెపు బుజ్జిబాబు, ఇర్రి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంచికచర్ల:** కంచికచర్ల టిడిపి కార్యాలయంలో బచ్చుల అర్జునుడు చిత్ర పటానికి మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, నాయకులు గుత్తా రత్నం, ఓంకార్, అన్నదాత రామకష్ణ, కోగంటి నాని తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. **ప్రజాశక్తి-నందిగామ:** కాకాని నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో టిడిపి నాయకులు అర్జునుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.



జగ్గయ్యపేటలో...



వన్‌టౌన్‌లో...



మెమో నెంబర్ 6464 రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-విజయవాడ:

ఆటో కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 64 64 మెమోను రద్దు చేసి ఎన్‌టిఆర్ జిల్లాలోకి పెనమలూరు, కంకిపాడు, గన్నవరం, ఉయ్యూరు ప్రాంతాల ఆటోలను అనుమతించాలని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు కె.దుర్గారావు కోరారు. స్థానిక దుర్గాపురం బిఆర్‌టిఎస్ రోడ్డులోని నండూరి ప్రసాదరావు భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తామన్నారు. డీజిల్ ఆటోలను గ్యాస్ ఆటోలుగా మార్చుకోవడానికి త్వరలో అనుమతి రాబోతుందని డిటిసి తెలిపారని అన్నారు. విజయవాడ నగరంలో గ్యాస్ బండల క్లీనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. వేలాది రూపాయల జరిమానాలు విధించే జిఒ నెంబర్ 21 రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో విజయవాడ ఆటో వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, నగర నాయకులు డి.కోటయ్య, పి.తిరుపతయ్య జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన హోమం

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడి ఆధ్వర్యంలో శత చండీసహిత మహా రుద్రయాగంలో భాగంగా రెండో రోజు శుక్రవారం చండీ హోమం, మూల మంత్ర హవనములు, నిత్యార్చన, నీరాజనం, మంత్రపుష్పం ఘనంగా నిర్వహించారు. లోకకళ్యాణార్థం ఈ నెల 2వ తేదీ నుండి 6 వరకు ఐదు రోజుల పాటు దేవస్థానంలో జరిగే



'శత చండీ సహిత మహారుద్రయాగం'లో భాగంగా శుక్రవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, ట్రస్ట్ బోర్డు సభ్యులు కట్టా సత్తయ్య, బుద్దా రాంబాబు, చింతా సింహాచలం, బచ్చు మాధవీక్రిష్ణ, స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, వైదిక సిబ్బంది కోటా ప్రసాద్ పాల్గొన్నారు.

హస్త కళలను ఆదరించాలి : జెసి

ప్రజాశక్తి-విజయవాడ: భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపమైన హస్తకళలను ఆదరించి హస్తకళాకారులను ప్రోత్సహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాపు మ్యూజియంలో లేపాక్షి థీమేటిక్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రాచీన హస్త కళలు సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనమన్నారు. ఏంతో మంది కళాకారులు వారి కళానైపుణ్యంతో వినియోగదారులను ఆకర్షించే రీతిలో రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచడం అభినందనీయమన్నారు. హస్త కళలకు లేపాక్షి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తుందన్నారు. ఇటీవల నగరంలో నిర్వహించిన లేపాక్షి మెగా ఎగ్జిబిషన్‌కు ప్రజల నుండి విశేష స్పందన రావడంతో బాపు మ్యూజియంలో ఈ నెల 12వ తేదీ వరకు లేపాక్షి హస్త కళా ప్రదర్శనను నిర్వహిస్తున్నారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లేపాక్షి మేనేజర్ ఎం.సురేష్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుండి రాత్రి 9 గంటల వరకు సెలవు దినాలలో కూడా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండీక్రాఫ్ట్స్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అపర్ణ లక్ష్మి, హెచ్‌పిఒ ఎం.సువర్చల, హస్తకళల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డి.రమాదేవి, జనరల్ మేనేజర్ నరసింహారావు, మేనేజర్ పి.వాసుదేవరావు, డిప్యూటీ మేనేజర్లు బి.శైలజ పాల్గొన్నారు.

భూ సేకరణ పనులు వేగవంతం

సాధారణ, జాతీయ రహదారుల భూ సేకరణ పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్ ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న సాధారణ, జాతీయ రహదారులకు సంబంధించి భూ సేకరణ పనులపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో విజయవాడ సబ్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. నందిగామ జాతీయ రహదారి పనులు, కంచికచర్ల మండలం కంచికచర్ల, పరిటాల భూ సేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గుణదల రైల్వే డబ్లింగ్ కు సంబంధించి భూ సేకరణలో మార్కెట్ విలువల ప్రతిపాదనలు వెంటనే పంపాలని విజయవాడ నార్త్ తహాశీల్దార్‌ను ఆదేశించారు.

